వైసీపీ గూండాలకు భయపడొద్దు



బద్వేలు నియోజకవర్గం అమగంపల్లెలో బస్సుయాత్రను జెండా ఊపిప్రారంభిస్తున్న వైఎస్ షర్మిల

- నేను ఇక్కడే ఉంటా.. అందరికీ అండగా ఉంటా
- హంతకులు మళ్లీ చట్టసభలకు వెళ్లకూడదు
- అధర్మం వైపు నిలబడ్డ అవినాశ్ కావాలా..
- న్యాయం వైపు నిలబడ్డ వైఎస్ షర్మిల కావాలా
- తేల్చుకోవాలన్న వైఎస్ షర్మిల
- నాన్న చివరి కోరిక షర్మిలను ఎంపీగా చేయాలని
- హత్యా రాజకీయాలు మనకొద్దు : డాక్టర్ సునీత
- తొలిరోజు బస్సు యాత్ర సక్సెస్

"నేను కడప గడ్డపై పుట్టిన బిడ్డను.. వైఎస్సార్, వివేకా బాటలోనే మీకు అందుబాటులో ఉంటా.. ఇక్కడే ఉంటా. నన్ను ఎంపీగా చూడాలని చిన్నాన్న కోరిక. ఆయన ఆశయ సాధనకు పోటీ చేస్తున్నా. మీరు ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదు.. వైసీపీ గుండాలకు బెదరాల్సిన అవసరం లేదు. ఏ కష్టమొచ్చినా మీ బిడ్డ ముందు ఉంటుంది" అని పీసీసీ అధ్యక్షురాలు, కడప ఎంపీ అభ్యర్థి వైఎస్ షర్మిల అన్నారు. రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించిన జగన్‌కు మళ్లీ ఓటు అడిగే హక్కులేదన్నారు. హత్యారాజకీయాలు వద్దని, వివేకాను హత్య చేయించిన అవినాశ్‌రెడ్డిని ఓడించాలని డాక్టర్ సునీత పిలుపునిచ్చారు. వీరు శుక్రవారం చేపట్టిన బస్సుయాత్ర సక్సెస్ కావడంతో కాగ్రెస్ శ్రేణుల్లో ఆనందం నెలకొనగా.. వైసీపీలో కలవరం రేగింది.

కడప, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నుంచి కడప ఎంపీ అభ్యర్థిగా దివంగత వైఎస్ కుమార్తె, సీఎం జగన్ చెల్లి షర్మిల పోటీ చేస్తున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం జిల్లాలోని బద్వేలు నియోజకవర్గం కాశినాయన మండలంలోని అమగంపల్లె నుంచి బస్సుయాత్ర చేపట్టారు. వివేకా కూతురు డాక్టర్ సునీత పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు, బద్వేలు అసెంబ్లీ అభ్యర్థి విజయజ్యోతితో కలిసి బస్సుయాత్ర చేపట్టారు. తొలిరోజు బస్సుయాత్ర కాశినాయన మండలంలోని అమగంపల్లె నుంచి సావిశెట్టిపల్లె మీదుగా కలసపాడు, కాశినాయన, పోరుమామిళ్ల, బి.కోడూరు బద్వేలు, అట్లూరు మీదుగా సాగింది. ఈ సందర్భంగా అక్కాచెల్లెళ్లు దివంగత వైఎస్సార్, వివేకా మధ్య ఉన్న అనుబంధం గుర్తుకు చేసుకున్నారు. ఇద్దరూ రామలక్ష్మణులుగా ఉండేవారన్నారు.

ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ దివంగత వైఎస్సార్ కాంగ్రెస్ మనిషి అని ఆయన ముఖ్యమంత్రిగా ఎన్నోఅద్భుతాలు చేశారన్నారు. ఇప్పుడు జగన్ సీఎంగా ఉన్నారు. బీజేపీకి రాష్ట్రాన్ని తాకట్టుపెట్టారన్నారు. ఒకప్పుడు వైఎస్, వివేకా జిల్లా ప్రధాన నాయకులని.. ఇక్కడి ప్రజలకు ఏ కష్టం వచ్చినా ముందుండేవారన్నారు. "వైఎస్ వెళ్లిపోయారు. వివేకాను గొడ్డలితో క్రూరంగా చంపివేశారు. వివేకా చనిపోయి ఐదేళ్లు దాటింది. అన్ని ఆధారాలు ఉన్నా చర్యలు లేవు. హంతకుడు అవినాశ్‌రెడ్డే అని అన్ని ఆధారాలున్నాయి. ఫోన్ కాల్స్ ఉన్నాయి.. గూగుల్ డేటా ఉంది. అయినా కేసు ఒక్క అడుగువుముందుకు పడడంలేదు" అన్నారు. అ .ది ౩ా ం౦ ం అడ్డుపెటుకుని బయట తిరుగుతున్నారన్నారు. హంతకులు మళ్లీ చట్టసభలకు వెళ్లకూడదని.. అధర్మం వైపు నిలబడ్డ అవినాశ్ కావాలా.. న్యాయం వైపు నిలబడ్డ వైఎస్ షర్మిల కావాలా జనం తేల్చుకోవాలని షర్మిల సూచించారు.





బద్వేలులో షర్మిల బస్సుయాత్రకు హాజరైన జనం.. ఇన్‌సెట్‌లో ప్రజలకు అభివాదం చేస్తున్న షర్మిల, సునీత

జగన్ రాష్ట్రానికే కాదు జిల్లాకు ఏమీ మేలు చేయలేదన్నారు. జిల్లాకు మంచినీళ్లు ఇవ్వలేదని, విభజన చట్టం ప్రకారం కడపకు స్టీలు ఫ్యాక్టరీ తేలేదన్నారు. 31 మంది ఎంపీలు ఉన్నా ఒక్కరూ హామీలపై ప్రశ్నలు వేయలేదని ఎద్దేవా చేశారు. తాను కడప గడ్డపై పుట్టిన బిడ్డనని వైఎస్సార్, వివేకా బాటలోనే మీకు అందుబాటులో ఉంటా, ఇక్కడే ఉంటానని అన్నారు. తనను ఎంపీగా చూడాలని చిన్నాన్న కోరిక, ఆయన ఆశయ సాధనకు పోటీ చేస్తున్నా అన్నారు. మీరు ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదన్నారు.. వైసీపీ గుండాలకు బెదరాల్సిన అవసరం లేదు. ఏ కష్టమొచ్చినా మీ బిడ్డ ముందు ఉంటుందన్నారు. రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించిన జగన్‌కు మళ్లీ ఓటు అడిగే హక్కులేదన్నారు. ఆయన రాష్ట్రాన్ని బీజేపీకి తాకట్టుపెట్టాడని, అప్పులపాలు చేశాడని అన్నారు. "స్టీలు ప్లాంటు, ఇరిగేషన్ ప్రాజెక్టులు రాజశేఖర్‌రెడ్డి కల. జిల్లాలో ఒక్క ప్రాజెక్టు పూర్తి కాలేదు. స్టీలు ప్లాంటు లేదు. యువత లేని రాష్ట్రంగా మారింది. జగన్ పాలనలో వలసలే. మద్యనిషేధం అని చెప్పి తూట్లు పొడిచారు" అన్నారు.

షర్మిలను చూస్తే జగన్‌కు భయం : సునీత

వైఎస్ వివేకా కుమార్తె సునీత మాట్లాడుతూ షర్మిల ఎదుగుతుందని పక్కనబెట్టారన్నారు. "నాన్న చివరి కోరిక షర్మిలను ఎంపీ చేయాలని. షర్మిల కోసం ఎంపీ అడుగుతున్నాడని వివేకాను చంపారు. నాన్నను చంపిన వారికే మళ్లీ జగన్ టికెట్ ఇచ్చాడు. హత్యారాజకీయాలు మనకు వద్దు. ఈ పని చేయించింది ఎంపీ అవినాశ్‌రెడ్డి. ఆయన మళ్లీ పోటీ చేస్తున్నాడు. జగన్ జైల్లో ఉన్నప్పుడు షర్మిల పాదయాత్ర చేసి పార్టీని నిలబెట్టింది. జగన్‌కు షర్మిలను చూస్తే భయం పట్టుకుంది. షర్మిలను చూస్తే వైఎస్సార్ గుర్తుకు వస్తారు. వైఎస్‌కు ఉన్న ప్రతి లక్షణం షర్మిలాకు ఉంది. అందుకే ఎంపీ కాకుండా జగన్ అడ్డుకున్నారు" అని సునీత మండిపడ్డారు.

అడుగడుగునా అపూర్వ స్వాగతం

జగన్ కాంగ్రెస్‌ను వీడి వైసీపీ స్థాపించారు. అప్పటి వరకు కాంగ్రెస్ పార్టీలో పేరున్న నాయకులంతా వైసీపీలోకి జంప్ అయ్యారు. రాష్ట్ర విభజన, జగన్ పార్టీతో కాంగ్రెస్ దెబ్బతింది. ఇప్పుడు కడప జిల్లా వైసీపీ అంతా అవినాశ్ రెడ్డి ఆధ్వర్యంలో ఉంది. అటు అధికారం, ఇటు పదవులు అన్నింటిలో అవినాశే కీలకంగా ఉన్నారు. వివేకానందరెడ్డి హత్యలో ఆరోపణలు ఎదుర్కొంటున్న అవినాశ్‌ను ఓడించేందుకు.. షర్మిల, సునీతలు తమకు జరిగిన అన్యాయాన్ని తెలిపేందుకు పోరుబాట పట్టారు. ఇందులో భాగంగా శుక్రవారం నిర్వహించిన బస్సుయాత్రకు జనం నుంచి మంచి స్పందన వచ్చింది. కాంగ్రెస్ పార్టీ లేదనుకున్న చోట మహిళల నుంచి అపూర్వ స్పందన వచ్చింది. షర్మిల కూడా చాలా సాదాసీదాగా అమ్మా అంటూ సంబోధిస్తూ అభివాదం చేస్తూ ముందుకు వెళ్లారు. పక్కన కూర్చున్న సునీతను అమ్మా.. వివేకానందరెడ్డి కూతురు అంటూ పరిచయం చేస్తూ ఇరువురు అక్కా చెల్లెళ్లు జనాలతో మమేకమవుతూ చేపట్టిన బస్సు యాత్రకు మంచి స్పందన వచ్చింది. కాగా బస్సుయాత్రలో భాగంగా శనివారం వైఎస్ షర్మిల కడప నియోజకవర్గంలో పర్యటించనున్నారని డీసీసీ అధ్యక్షుడు శ్రీరాములు తెలిపారు.



నాగసానిపల్లె సమీపంలోని గుట్టలో టిప్పర్‌కు ఎక్సకవేటర్‌తో మట్టిని నింపుతున్న దృశ్యం

గుట్టలు గుల్ల

- రాత్రి, పగలు అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు
- చెరువులనూ లోడేస్తున్నారు
- అనుమతులు లేకుండా అక్రమ రవాణా
- పట్టించుకోని అధికారులు

ఖాజీపేట, ఏప్రిల్ 5: ఎక్కడ చూసినా అధికార పార్టీ నాయకులు విచ్చలవిడిగా గుట్టలు, చెరువులను గుల్ల చేస్తున్నారు. అక్రమంగా మట్టిని తోలుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. ఖాజీపేట మండల పరిధిలోని ఆంజనేయ కొట్టాలు చెరువులో, నాగసానిపల్లె సమీపంలోని గుట్టలో ఎక్సకవేటర్‌తో తవ్వి టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా రాత్రి, పగలు తేడా లేకుండా యథేచ్ఛగా మట్టిని అక్రమ రవాణా చేస్తున్నారు. ఎన్నికల కోడ్ వచ్చినప్పటి నుంచి మరింతగా దూకుడు పెంచారు. పెద్ద నాయకులు మనం చెప్పినట్లు ఉంటారు, మనకేమైనా వారే చూసుకుంటారు లేదంటే మనం ఓట్లు వేయం అని బెదిరింపులకు దిగవచ్చనే ధోరణితో.. కిందిస్థాయి వైసీపీ నేతలు వారు పాడిందే పాట, ఆడిందే ఆట అన్న విధంగా రెచ్చిపోతున్నారు. రాత్రి, పగలు ఇష్టానుసారంగా మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే మేము అధికార పార్టీవారం, మీరు అడుగకూడదని అంటున్నారని గ్రామస్థులు వాపోతున్నారు.

అధికారుల తీరుపై జనం ఆగ్రహం

రైతులు ఎక్కడైనా పొలాలకు మట్టి తోలుకుంటుంటే అధికారులు కేసులు నమోదు చేస్తారని లేదంటే వేలకు వేలు వసూలు చేస్తారని అంటున్నారు. అదే వైసీపీ వారు జాతీయ రహదారిపై రాత్రి, పగలు మట్టి తోలుతుంటే అధికారులకు కనపడదా అని ప్రశ్నిస్తున్నారు. అధికార పార్టీవారైతే ఒక రూలు, రైతులు అయితే ఒక రూలా అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా అక్రమంగా మట్టిని తరలిస్తున్న వారిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అనుమతులు లేవు : తహాశీల్దారు

మట్టిని గానీ, గ్రావెల్ గానీ తరలించేందుకు ఎటువంటి అనుమతులు లేవని ఖాజీపేట తహాహశీల్దారు వెంకటలక్ష్మి అన్నారు. అక్రమంగా తరలిస్తూ పట్టుపడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

వైసీపీ పాలనలో ఏపీ సర్వనాశనం

- జగన్ నేలమాళిగలు ఎన్నో నిండాయి
- ఓడే అవినాశ్.. నీకు సిగ్గులేదా
- ఎద్దేవా చేసిన ఆదినారాయణరెడ్డి

జమ్మలమడుగు, ఏప్రిల్ 5: వైసీపీ పాలనలో అయిదు సంవత్సరాల కాలంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పూర్తిగా సర్వనాశనం అయిందని జమ్మలమడుగు ఎన్డీయే కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి చదిపిరాళ్ల ఆదినారాయణరెడ్డి ఘాటుగా విమర్శించారు. జమ్మలమడుగులో శుక్రవారం సాయంత్రం టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి సభ జరిగింది. జమ్మలమడుగు నియోజకవర్గంలోని ఉమ్మడి పార్టీల కార్యకర్తలు సమావేశానికి వేలాది మంది తరలి వచ్చారు. ఈ సందర్భంగా సమావేశంలో పక్కనే టీడీపీ కడప ఎంపీ అభ్యర్థి భూపేశ్‌రెడ్డిని కూర్చోబెట్టుకుని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదినారాయణరెడ్డి ప్రసంగించారు. దేవగుడి కుటుంబంలో తామిద్దరం పోటీలో ఉన్నామని, ఉమ్మడి పార్టీల కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పనిచేసి ఒక్కొక్కరు అన్ని ప్రాంతాల్లో తిరిగి అత్యధిక మెజార్టీ ఓట్లు సాధించాలన్నారు. కోడికత్తితో పాటు వివేకానందరెడ్డిని తాను ఇంటిలో దూరి హత్య చేసినట్లు తనపై కేసులు పెట్టారన్నారు. నాతోపాటి చంద్రబాబునాయుడు, బీటెక్ రవిలను కేసులో పెట్టారన్నారు. "కడప వైసీపీ ఎంపీగా ఓడే అవినాశ్ నీకు సిగ్గులేదా.. నేను వివేకానందరెడ్డిని ఇంటిలో దూరి చంపానా, నీకు జగన్‌మోహన్‌రెడ్డికి ఏమాత్రం సిగ్గులేదు" అన్నారు. జమ్మలమడుగులో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిపై ఘాటుగా విమర్శలు చేశారు. చేనేతలు, మత్స్యకారులు, రియల్‌ఎస్టేట్ వ్యాపారులు ముంపువాసులకు అన్ని వర్గాలను మహామోసగాడు జగన్ దెబ్బకొట్టాడన్నారు. రాష్ట్రంలో రోడ్లు రిపేర్లు చేయలేదని తాగునీటి సమస్యలు పట్టించుకోలేదని, కాంట్రాక్టులకు బిల్లులు ఇవ్వలేదని వైసీపీ నాయకులు అన్ని ప్రాంతాల్లో ఇసుక తదితరవన్నీ నిలువుదోపిడీ చేశారన్నారు. అందులో భాగంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి నేలమాళిగలు అన్నీ నింపుకున్నాడన్నారు. స్టీల్‌ప్లాంట్ ఊసే లేదన్నారు. జగన్ కేవలం భారతి సిమెంటు ఫ్యాక్టరీ మాత్రమే స్వలాభం కోసం నిర్మించుకుని రాష్ట్రంలో ఎక్కడా పరిశ్రమలు తీసుకురాలేదన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జమ్మలమడుగు ఎమ్మెల్యే అభ్యర్థి సి.ఆదినారాయణరెడ్డి, పక్కనే టీడీపీ కడప ఎంపీ అభ్యర్థి భూపేశ్‌రెడ్డి

కడప ఎంపీ అభ్యర్థి భూపేశ్‌రెడ్డి మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థిగా టీడీపీ తరుపున తాను పోటీలో ఉన్నానని, సైకిల్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని, అలాగే కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి తన బాబాయి సి.ఆదినారాయణరెడ్డి కమలం గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కార్యకర్తలకు ఆయన సూచించారు. జగన్‌మోహన్‌రెడ్డిని ఈ ఎన్నికల్లో ప్రజలు ఇంటికి పంపాలన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా వస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేసి కూటమికి విజయానికి సహకరించాలని సూచించారు. అనంతరం ఇద్దరినీ ప్రజలు, కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

సామాజిక విప్లవయోధుడు జగ్జీవన్‌రామ్



బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ విజయరామరాజు

కడప(కలెక్టరేట్), ఏప్రిల్ 5: దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడుతూనే మరో వైపు సామాజికవివక్షను జయించిన సామాజిక విప్లవ యోధుడు డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్‌కు యావత్తు దేశం నీరాజనాలు అర్పిస్తోందని కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్లో డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ 117వ జయంతి వేడుకలు డీఆర్వో గంగాధర్‌గౌడ్ అధ్యక్షతన జరిగాయి. ముఖ్య అతిథులుగా కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ గణేశ్ కుమార్, నగర కమిషనర్ ప్రవీణ్‌చంద్, సాంఘిక సంక్షేమశాఖ డీడీ సరస్వతి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం, అణగారిన వర్గాల హక్కుల కోసం అలుపెరగని సమరం సాగించిన రాజకీయ, సామాజిక విప్లవ యోధుడు జగ్జీవన్‌రామ్ అన్నారు. సమాజంలో శాంతియుత వాతావరణం నెలకొల్పడం, వివక్షను నిర్మూలించడంలో చేసిన కృషికి గుర్తుగా ఆయన జయంతిని సమతా దివస్‌గా జరుపుకుంటున్నామన్నారు. ఆయన ఆశయ స్ఫూర్తితో జిల్లా అభివృద్ధి కోసం అధికారులు పాటుపడాలన్నారు. ముందుగా కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌లు జ్యోతి ప్రజ్వలన చేసి జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అధికారులు డాక్టర్ బ్రహ్మయ్యఆనంద్ నాయక్, ప్రభాకర్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, వీరన్న, శాంతి తదితరులు పాల్గొన్నారు.

దేశ భవిష్యత్తు బంగారుబాటలో సాగడంలో యువతదే కీలకపాత్ర. సుపరిపాలన అందించే పాలకులను ఎన్నుకోవడంలో వీరు ప్రధాన భూమిక పోషించాల్సి ఉంది. దీనికి ఓటే మంచి సాధనం. జిల్లాలో ఎన్నికలు జరిగితే అభ్యర్థుల భవితవ్యాన్ని నిర్దేశించగల సత్తా ఉన్న యువతకు ఈదఫా ఎన్నికల్లో కొత్తఓటు నమోదులో జిల్లా యంత్రాంగం విఫలమైంది. జిల్లాలో సగం మంది యువతకు కొత్త ఓటర్ల నమోదులో చోటు దక్కలేదని అంటున్నారు.

యువ ఓటర్లే నిర్ణేతలు

- సగం మంది యువతకు ఓట్లు లేవ్
- తూతూ మంత్రంగా స్వీప్ ప్రోగ్రామ్
- మంది మార్బలంతో హడావిడే తప్ప..
- యువ ఓటర్ల నమోదులో చతికిలపడ్డ యంత్రాంగం
- 15 వరకు కొత్తగా ఓటు నమోదుకు అవకాశం



కడప (కలెక్టరేట్), ఏప్రిల్ 5: ఓటరు తుదిజాబితా విడుదల నాటికి 18 ఏళ్లు నిండే యువతకు కొత్తగా ఓటు హక్కు కల్పించేందుకు ఎన్నికల సంఘం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మందస్తుగా కొత్తగా ఓటు హక్కు కల్పించేందుకు మూడు దశల్లో ప్రణాళికలు సిద్ధం చేశారు. ప్రత్యేక ఓటర్ల నమోదు బూత్ స్థాయిలో చేపట్టారు. సిస్టమాటిక్ ఓటరు ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ (స్వీప్) ద్వారా 18-19 ఏళ్ల లోపు యువతీ యువకులకు ఓటు కల్పించేందుకు బీఎల్వోలు మొదలు రెవెన్యూ యంత్రాంగం కంకణం కట్టుకుంది. కానీ కళాశాలల చుట్టూ తిరిగి ఎన్నికల కమిషన్ ఇచ్చిన కరపత్రాలను విద్యార్థులకు పంచారే తప్ప.. ఓటు ప్రాధాన్యతపై అవగాహన కల్పించే విషయంలో విఫలమయ్యారనే విమర్శలున్నాయి. జిల్లాలో 2024 లెక్కల ప్రకారం 22,47,356 మంది జనాభా ఉన్నారు. వీరిలో 17,29,837 మందికి ఓటు హక్కు కల్పించాల్సి ఉంది. ఇప్పటి వరకు 16,16,509 మందికి ఓటు కల్పించారు. అందులో కొత్తగా ఓటు హక్కు పొందాల్సిన 18-19 ఏళ్ల యువత 86644 మంది ఉండగా అందులో సగం మందికి పైబడి నేటికీ ఓటు హక్కు కల్పించడంలో యంత్రాంగం విఫలమయ్యారు. కేవలం 34,311 మందికి మాత్రమే ఓటు హక్కు కల్పించారు. ఇంకా 52,333 మంది యువతకు ఓటు హక్కు కల్పించలేదు.

ఇంటింటా సర్వేలో చేసిందేమిటో?

ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీరు మొదలు జిల్లా వ్యాప్తంగా 1941 మంది బూతు లెవల్ అధికారులు ఓటర్ల తొలగింపులు, చేర్పులు, సవరణలు అంటూ ఇంటింటా జల్లెడ పట్టారు. ఓటర్ల జాబితాలో తప్పులను గుర్తించడం, డబుల్ ఓటర్లను తొలగించడం, చనిపోయిన ఓటర్ల తొలగింపులు కూడా ఆశించిన స్థాయిలో జరగలేదనే విమర్శలున్నాయి. గత ఏడాది జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి ఓడిపోయారు. దీనికి కారణం.. అధికార వైసీపీ తమకు ఎలాంటి మేలు చేయలేదని, నిరుద్యోగులుగా మిగిల్చారని ఆగ్రహం ఉండటంతో వీరంతా టీడీపీ అభ్యర్థిని ఎమ్మెల్సీగా గెలిపించారు. ఇంటింటికి నిత్యం ఏదో ఒక సర్వే పేరుతో తిరిగే వలంటీర్లు.. జనాల నాడిని బట్టి వారి ద్వారా సేకరించిన ఫారం-6 దరఖాస్తులను అధికార పార్టీకి విధేయులు కారని నిగ్గుతేల్చి యువతకు సంబంధించిన వాటిని బుట్టదాఖలు చేశారని పలువురు అనుమానిస్తున్నారు. అందుకే కొత్తగా ఓటు హక్కు పొందిన 18-19ఏళ్ల యువతలో దాదాపు 60శాతానికి పైగా ఇంకా ఓటర్లుగా నమోదు కాలేదు.




వయసు వారీ ఓటర్ల సంఖ్య

వయసు	ఓటర్లు
18-19	34,311
20-29	2,97,276
30-39	4,15,018
40-49	3,48,572
50-59	2,60,176
60-69	1,59,463
70-79	78,970
80-100	22,723

యువ ఓటర్లే కీలకం

జిల్లాలో రాజకీయవేడి మొదలైంది. అధికార, ప్రతిపక్ష పార్టీలు ఎన్నికల బరిలో దిగాయి. మే 13న జరిగే ఎన్నికల కోసం ప్రచారం ముమ్మరం చేశారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి హవా సాగింది. యువతంతా ఆయనకే ఓట్లు వేసి అధికారం కట్టబెట్టారు. కానీ ఈ పర్యాయం ఆ పరిస్థితి లేదు. ఇప్పటికే గత ఏడాది జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తాము ఎవరి పక్షమో స్పష్టంగా తెలియజేశారు. జిల్లాలో ఈ ఎన్నికల్లో 18-40 ఏళ్ల లోపు యువత 8,77,763 మంది ఉన్నారు. అందులో 7,46,605 మందికి ఓటు హక్కు ఉండడంతో త్వరలో జరగనున్న ఎన్నికల్లో అభ్యర్థుల భవితవ్యం తేల్చడంలో వీరి పాత్ర కీలకం కానుంది.



కొత్తగా ఓటు నమోదుకు 15వరకు అవకాశం

కొత్తగా ఓటు హక్కు నమోదుకు ఈనెల 15వ తేదీ చివరి ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించింది. ఇప్పటికే ఎన్నికల షెడ్యూల్ విడుదలై ప్రక్రియ ప్రారంభమైంది. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు అభ్యర్థుల నామినేషన్ ప్రక్రియకు 10 రోజుల ముందు వరకు ఫారం-6 దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఈ దఫా సాధారణ ఎన్నికల్లో కొత్తగా ఓటు పొందే అవకాశం ఉంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి కోరారు.

11 నుంచి కడప మీదుగా ప్రత్యేక రైలు



కడప (ఎడ్యుకేషన్), ఏప్రిల్ 5: కాచిగూడ-తిరుపతి-కాచిగూడ (07655/ 07654) ప్రత్యేక రైలు కడప మీదుగా నడవనున్నట్లు కడప రైల్వే చీఫ్ టికెట్ ఇన్‌స్పెక్టర్ ఉమర్ బాషా, సీనియర్ కమర్షియల్ ఇన్స్‌పెక్టరు జనార్దన్ తెలిపారు. ఈనెల 11, 18, 25, మే 1వ తేదీల్లో కాచిగూడ నుంచి తిరుపతికి ఈ రైలు నడుస్తుందన్నారు. అలాగే ఈనెల 12, 19, 26, మే 2వ తేదీల్లో తిరుపతి నుంచి కాచిగూడకు వెళుతుందన్నారు. ఈ రైలు కాచిగూడలో గురువారం రాత్రి 10.30కు బయల్దేరి ఎర్రగుంట్లకు శుక్రవారం ఉదయం 6.30కు కడపకు 7.05కు వచ్చి తిరుపతికి శుక్రవారం ఉదయం 10.1గంటలకు చేరుకుంటుందన్నారు. అలాగే ప్రతి శుక్రవారం తిరుపతిలో రాత్రి 8.05కు బయల్దేరి కడపకు అదేరోజు రాత్రి 10.25కు, ఎర్రగుంట్లకు 11 గంటలకు చేరుకుని మరుసటిరోజు ఉదయం 9.30కు కాచిగూడ చేరుకుంటుందన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రూ.198 లక్షల నగదు.. విలువైప లిక్కర్ సీజ్

కడప(కలెక్టరేట్), ఏప్రిల్ 5: జిల్లాలో ఎన్నికల కోడ్ అమలు నాటి నుంచి ఇప్పటి వరకు రూ.1.98,37,670ల నగదు, రూ.1,36,08,925ల లిక్కర్, ఇతర వస్తువులు సీజ్ చేసి 596 ఎఫ్ఐఆర్ కేసులు నమోదు చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనపై 394 ఫిర్యాదులు రాగా అందులో 388 పరిష్కరించామని పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా, కంప్లైంట్స్ మానిటరింగ్ యాప్, డిస్ట్రిక్ట్ కాల్, ఎన్‌జీఎన్‌సీ, 19501, సిటిజన్ యాప్, సోషియల్ మీడియా, ఆఫ్ లైన్, సి-విజిల్, తదితరాల ద్వారా ఫిర్యాదులు అందాయని తెలిపారు. వీటన్నింటిపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

మామిడి రైతుకు చేదుఫలం

- కాపులేని మామిడి
- పంటపై ప్రతికూల వాతావరణం
- దిగుబడిపై తీవ్ర ప్రభావం
- సీజన్ మొదలైనా ఇంకా పూర్తిగా రాని కాపు
- గగ్గోలు పెడుతున్న మామిడి రైతులు
- ప్రభుత్వం నుంచి సాయం లేదని ఆవేదన



మామిడి రైతులను కష్టాలు వెంటాడుతున్నాయి. ప్రతి ఏడాది అటు ప్రకృతి ప్రకోపం, ఇటు ప్రభుత్వ వైఫల్యంతో నష్టాల ఊబిలో కొట్టుమిట్టాడుతున్నాడు. ఈ ఏడాది కూడా మామిడి తోటలపై ప్రతికూల వాతావరణ ప్రభావం చూపెంది. పూత ఆలస్యంగా రావడం.. పూత వచ్చినా నిలబడకపోవడంతో మామిడి చెట్లకు కాయలులేక దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపింది. ఎకరాకు 3 నుంచి 4 టన్నులు రావాల్సిన దిగుబడి అర్ధ టన్ను, ఒక టన్నుకే పరిమితమైంది. దీంతో తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని రైతులు గగ్గోలు పెడుతున్నారు.

కడప(రూరల్) ఏప్రిల్ 5: వైఎస్ఆర్ జిల్లాలో దాదాపు 10వేల ఎకరాలలో మామిడి పంట సాగు లో ఉంది. అన్నమయ్య జిల్లాలో ఇంతకంటే ఎక్కువ సాగులో ఉంది. ప్రధానంగా నీలం, బేనీషా పంటలను సాగు చేస్తున్నారు. సాధారణంగా ఒక ఎకరాకు 4 టన్నుల దిగుబడి వస్తుంది. ఈమేరకు ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లాలో దాదాపు 60 వేల నుంచి 80 వేల టన్నుల డిగుబడి ప్రతి ఏడాది వస్తున్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. అయితే ఈ ఏడాది మామి డి తోటలకు ప్రతికూల వాతావరణం కారణంగా పూత లేకపోవడంతో దిగుబడి గణనీయంగా పడిపోయింది.

ఆలస్యంగా పూత రావడంతో...

సాధారణంగా మామిడిపూత సీజన్ నవంబర్ చివరిలో మొదలై డిసెంబర్, జనవరి ఆఖరి వరకు అనువైన పరిస్థితి ఉంటుంది. ఈ సమయంలో రాత్రి, పగలు ఉష్ణోగ్రతలు సక్రమంగా ఉన్నపుడు మామిడి చెట్లలో అంతర్గతంగా ఒకరకమైన ఒత్తిడి కలిగి పూత ప్రక్రియ వేగంగా జరుగుతుంది. కానీ ఈ ఏడాది పూత సమయంలో పగలు రాత్రి చలివాతావరణమే కనిపించింది. ఈ కారణంగా మామిడిపూత సక్రమంగా రాలేదని శాస్త్రవేత్తలు చెపుతున్నారు. దీంతో అదునులో పూత రాకపోగా ఫిబ్రవరి నెల ఆఖరిలో కొన్ని చెట్లకు పూత వచ్చినా.. కాయలు కాకుండానే రాలిపోయింది. కొన్ని తోటల్లో మార్చిలోను పూత వచ్చింది. ఇప్పుడిప్పుడే పిందేలు తయారవుతున్నాయి. ఎండాకాలం లోపు ఇవి పండ్లు అయ్యే పరిస్థితి ఉండదు. దీంతో ఈ పూత సైతం వృథాగానే మిగిలిపోతుంది. ఇప్పుడు ఎక్కడా ఆశించిన మేర కాపులేదు. ప్రస్తుత సీజన్‌లో అదునులో పూత వచ్చిన తోటలు చాలా తక్కువగా ఉన్నాయి. ఇలాంటి తోటల్లోనే ఇప్పుడు కాయలు ఉన్నాయి.

కౌలుదారులకు తీవ్ర నష్టం

ఈ ఏడాది మామిడితోటలు కౌలుకు తీసుకున్న వారు తీవ్రంగా నష్టపోయే అవకాశం కనిపిస్తోంది. గత ఏడాది కంటే ఈ ఏడాది కౌలు ధరలు పెరి గాయి. అయినప్పటికి కౌలు మొత్తాన్ని ముందుగానే చెల్లించినవారు ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో కాపు రాకపోవడంతో గగ్గోలు పెడుతున్నారు. ఇంకొం త కాలం గడిస్తే ఏప్రిల్, మే నెలల్లో పెనుగాలలతో కూడిన అకాల వర్షాలు పడతాయని.. ఇదే జరిగితే పూర్తిగా నష్టపోతామని వాపోతున్నారు. ప్రభు త్వం నుంచి కూడా ఎలాంటి సహాయం అందటంలేదని ఆవేదన చెందుతున్నారు. సకాంలో వర్షాలు కురవకపోవడం, బూజు పురుగు ఆశించటం దిగుబడులపై ప్రభారం చూపిందని రైతులు వాపోతున్నారు.



ఝగ్గవంక ప్రాజెక్టు కింద సాగుచేసిన మామిడి తోటలు



ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా కాయలు లేని మామిడితోట



పెట్టుబడులు కూడా రావడం లేదు

మామిడి సాగులో ఆశించిన లాభాలు రాకపోగా పెట్టుబడులు కూడా చేతికి అందడం లేదు. ఒక ఎకరా పొలంలో పంటను సాగుచేశాను. ప్రతి ఏడాది పంట ఉత్పత్తికి అవసరమైన ఎరువులు, కలుపు నివారణ, మందుల పిచికారి, కూలీ ఖర్చులకు వేల రూపాయలను ఖర్చు చేస్తున్నాం. ప్రతికూల పరిస్థితులతో ప్రతి ఏడు నష్టపోతున్నాం. ఈ ఏడాది మామిడి పూత ప్రాథమిక దశలోనే రాలిపోవడంతో పంట ఉత్పత్తి 75 శాతం తగ్గిపోయింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మామి డి రైతుల కష్టాలను పట్టించుకోవడం లేదు.

- ఏటూరు రామచంద్రారెడ్డి, మామిళ్లపల్లె రైతు, చింతకొమ్మదిన్నె మండలం

ఉత్పత్తి 20 శాతమే...


ఈ ఏడాది మామిడి పంట ఉత్పత్తి 20 శాతమే వచ్చే అవకావాలు కనిపిస్తున్నాయి. ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఏర్పడమే ఇందుకు ప్రధా న కారణం. సాధారణంగా మామిడిపూత సీజన్ నవంబర్ చివరిలో మొదలై డిసెంబర్ వరకు ఉంటుంది. కానీ ప్రతికూల పరిస్థితుల కారణంగా పూత సక్రమంగా రాలేదు. రాష్ట్రమంతా ఇదే పరి స్థితి ఉంది. దీంతో ఉత్పత్తి చాలా వరకు తగ్గిపోయింది.

-రాజీవ్ మైఖేల్, ఉద్యానశాఖ జిల్లా అధికారి

ఒక వ్యక్తికి రెండు చిరునామాలా!

- వ్యాపారానికి ఒకటి, రాజకీయానికి మరొకటి
- ఎన్నికల కమిషన్‌ను మోసగిస్తున్న ఎమ్మెల్యే
- కమలాపురం ఎమ్మెల్యేపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు

కడప (ఎన్టీఆర్ సర్కిల్), ఏప్రిల్ 5: ఒక వ్యక్తి ఒక చోట నివాసం ఉంటూ.. మరో చోట కూడా నివాసం ఉన్నట్లు తప్పుడు చిరునామాలు చూపించి ఎన్నికల కమిషన్‌ను మోసపుచ్చుతున్నారు. గత రెండు పర్యాయాలు ఇదే పనిచేసి ఎమ్మెల్యేగా ఎంపికయ్యారంటూ సీఎం జగన్‌రెడ్డి మేనమామ, కమలాపురం శాసనసభ్యుడు పి.రవీంద్రనాథరెడ్డిపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. మూడోసారి వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించిన నేపథ్యంలో పి.రవీంద్రనాథరెడ్డి నామినేషన్‌ను సమగ్రంగా పరిశీలించి డిస్క్వాలిఫై చేయాలంటూ వీరపునాయునిపల్లె మండల కేంద్రానికి చెందిన పీవీవీ నాగప్రసాద్ ఏపీ ముఖ్య ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. 2014లో కడప అసెంబ్లీ పరిధిలో ఓటు హక్కు కలిగినట్లు, 2019లో కమలాపురం పట్టణంలో ఓటు ఉన్నట్లు పేర్కొంటూ ఎన్నికల కమిషన్‌తో పాటు ప్రభుత్వాన్ని మోసం చేశారంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. వాస్తవానికి రవీంద్రనాథరెడ్డి కడప నగరంలో నివాసం ఉన్న విషయం అందరికీ తెలుసని.. కానీ కమలాపురంలో తప్పుడు చిరునామా సృష్టించారంటూ ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలుస్తుంది. ఆయన ఆధార్‌కార్డు, ఓటరుకార్డులను పరిశీలిస్తే తేటతెల్లమవుతుందని వివరించినట్లు తెలుస్తుంది. కేవలం ఎన్నికల్లో మాత్రం నామినేషన్ వేసేందుకే కమలాపురం చిరునామాలను ఉపయోగిస్తున్నారని... వ్యాపార లావాదేవీలకు కడపలోని చిరునామా వాడుకుంటున్నట్లు ఫిర్యాదులో వివరించారు. ఆస్తులు కొనుగోలుకు కడపలోని చిరుమానాను వాడుకుంటున్నారని.. ఇందుకు సంబంధించిన భూముల క్రయ విక్రయాలకు రిజిస్ట్రార్ ఆఫీసులో చూపించిన కడపలోని చిరునామా వివరాలను ఫిర్యాదులో స్పష్టం చేసినట్లు సమాచారం. ఎమ్మెల్యే కుమారుడు రామాంజులురెడ్డి కూడా 2014, 19 సంవత్సరాల్లో కడప నగరంలో నివాసం ఉంటున్నట్లు చూపించారు. చింతకొమ్మదిన్నె మండంలో జడ్పీటీసీగా పోటీ చేసేందుకు సమర్పించిన నామినేషన్లలో చెన్నూరు మండలంలో నివాసం ఉంటున్నట్లు పేర్కొన్నారని వివరించారు. ఈ మేరకు తప్పుడు చిరునామాలతో మోసగిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డిపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలంటూ ఫిర్యాదులో పేర్కొన్నారని ఒక సమాచారం సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది.



To
Sri MUKESH KUMAR MEENA, IAS
Chief Electoral Officer & Ex-Officio
Secretary to Govt.
Room No 192, Ground Floor,
Building No.5, A.P Secretariat,
Velagapudi, Amaravati. 522238
Phone: +91-863-2445380
Fax: +91-863-2445158.
E-Mail:- ceo_andhrapradesh@eci.gov.in

వీరభద్రుడిని దర్శించుకున్న కడప అడిషనల్ సివిల్ జడ్జి

రాయచోటిటౌన్, ఏప్రిల్5: దక్షిణకాశీగా పేరుగాంచిన రాయచోటి పట్టణంలో శ్రీభద్రకాళీ సమేత వీరభద్రుడిని శుక్రవారం కడప అడిషినల్ సివిల్ జడ్జి ప్రదీప్‌కుమార్, ప్రిన్సిపల్ జడ్జి కవితలు దర్శించుకున్నారు. వీరికి ఆలయ కమిటీ చైర్‌పర్సన్ పోలం రెడ్డి విజయమ్మ, ఆలయ ఈవో డీవీ రమ ణారెడ్డిల ఆధ్వర్యంలో అలయ అర్చకులు సాంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. ఈసందర్భంగా వారు ఆలయంలోని వినాయకుడు, అఘోరలింగేశ్వరుడు, సుబ్రమణ్యంస్వామి, భద్రకాళి అమ్మవారు, కాలభైరవుడు, వీరభద్రుడు తదితర దేవతా మూర్తులను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు వారికి శాలువా, పూలమాలతో సత్కరించి ఆలయ విశిష్టత గురించి తెలియజేసి తీర్థప్రసాదాలు అందజేశారు.



వీరభద్రుడి సన్నిధిలో జడ్జి ప్రదీప్‌కుమార్ దంపతులు

పోట్లదుర్తిలో గడ్డివాములు దగ్ధం

- రూ.15 లక్షల మేర ఆస్తినష్టం



దగ్ధమవుతున్న గడ్డివాములు

ఎర్రగుంట్ల, ఏప్రిల్ 5: ఎర్రగుంట్ల మండలంలోని పోట్లదుర్తిలో సుమారు 12 గడ్డివాములు శుక్రవారం మధ్యాహ్నం అగ్నికి ఆహుతి అయ్యాయి. మధ్యాహ్నం సమయంలో ఏం జరిగిందో ఏమో తెలియదు కానీ ఒక గడ్డివాముకు నిప్పు అంటుకోవడంతో పక్కనే ఉన్న మిగతా వాములకు కూడా గాలికి శరవేగంగా మంటలు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో పడిగపాటి శివారెడ్డి, పెద్ద సుబ్బారెడ్డి, పీసీ సుబ్బిరెడ్డి, డి.ఓబులరెడ్డి, కే.లక్ష్మి, పి.రామసుబ్బారెడ్డి, సి.గుర్రప్పల గడ్డివా ములు కాలిపోయినట్లు తెలిసింది. ఈ సంఘటనలో సుమారు రూ.15 లక్షలు నష్టం సంభవించినట్లు బాధితులు చెబుతున్నారు. ఆర్టీపీపీ, ప్రొద్దుటూరు, కమలాపురం నుంచి వచ్చిన మూడు ఫైర్ ఇంజిన్ల సహాయంతో శుక్రవారం సాయంత్రం వరకు మంటలను ఆర్పే ప్రయత్నం చేస్తున్నారు. అయితే అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిందని బాధితులు వాపోతున్నారు. అసలే పశువుల మేత దొరకడం గగనంగా ఉన్న ప్రస్తుత తరుణంలో గడ్డివాములు కాలిపో వడంపై బాధితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చిరస్మరణీయుడు బాబు జగ్జీవన్‌రామ్

రాయచోటిటౌన్, ఏప్రిల్ 5: స్వాతంత్ర సమరయోధుడు, బహుఖ ప్రజ్ఞశాలి, సామాజిక సమానత్వం కోసం అలుపెరగని పోరాటం చేసిన డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ చిరస్మరణీయుడని అన్నమయ్య జిల్లా ఎస్పీ కృష్ణారావు కొనియాడారు. శుక్రవారం రాయచోటి పట్టణంలోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ 117వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మహనీయుల ఆదర్శాలను పాటిస్తూ సమసమాజ స్థాపనకు కృషి చేయాలన్నారు. డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ దేశ స్వాతంత్ర్యం, సామాజిక సమానత్వం కోసం అలుపెరగని పోరాటం చేసి ప్రజల మనస్సుల్లో చిరస్మరణీయుడయ్యారని కొనియాడారు. కార్యక్ర మంలో జిల్లా ఎస్పీతో పాటు జిల్లా అదనపు ఎస్పీ డాక్టర్ వీబీ రాజ్‌కమల్, ఏఏవో కృష్ణుడు, ఎస్బీ సీఐ సత్యనారాయణ, ఏఆర్ ఆర్ఐలు పెద్దయ్య, శ్రీనివాస్ తదితర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎస్పీ కృష్ణారావు

రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతి

దువ్వూరు (మైదుకూరు), ఏప్రిల్ 5: మండల కేంద్రమైన దువ్వూరు వద్ద గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో భార్య భర్త మృతి చెందారు. పోలీసుల వివరాల మేరకు... దువ్వూరు మండలంలోని భీమునిపాడుకు చెందిన పందిటి యేసయ్య (55), పందిటి సుజాత (46)లు తమ ద్విచక్రవాహనంలో ఎంకుపల్లెలోని ఓ సీమంతం కార్యక్రమా నికి వెళ్లారు. తిరిగి ఇంటికి వెళుతుండగా స్థానిక పెట్రోల్ బంక్ సమీ పంలో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడ్డ దంపతులను 108 వాహనంలో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమ ధ్యంలో యేసయ్య మృతి చెందగా.. సుజాత ఆసుపత్రిలో చికిత్స పొందు తూ శుక్రవారం మృతి చెందింది. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు ఎస్ఐ శ్రీని వాసులు తెలిపారు.



మృతి చెందిన దంపతులు యేసయ్య, సుజాత (ఫైల్ ఫొటో)

400 గ్రాముల బంగారం సీజ్



వివరాలు వెల్లడిస్తున్న టుటౌన్ సీఐ అబ్దుల్ కరీం

ప్రొద్దుటూరు క్రైం, ఏప్రిల్ 5: ఎటువంటి ఆధారాలు లేకుండా కోయంబత్తూర్‌కు చెందిన ఓ వ్యాపారి 400 గ్రాముల బంగారాన్ని కలిగి ఉండగా స్వాధీనం చేసుకున్నట్లు టూ టౌన్ సీఐ అబ్దుల్ కరీం తెలిపారు. ఇందుకు సంబంధించి వివరాలు వెల్లడించారు. శుక్రవారం సాయంత్రం ఆర్టీసీ బస్టాండు వద్ద ఎస్ఐ రామకృష్ణతో కలిసి తనిఖీలు చేపట్టామని తెలిపారు. ఆ సమయంలో కోయంబత్తురు పట్టణానికి చెందిన రాజారామ్ కరుప్పస్వామి అనే వ్యక్తి రాగా తనిఖీ చేశామన్నారు. అతని వద్ద 400 గ్రాముల బంగారు నగలు ఉండగా.. అందుకు సంబంధించిన బిల్లులు చూపకపోవడంతో సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. వీటి విలువ సుమారు 27లక్షలు ఉంటుందని సీఐ తెలిపారు.

అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్, ఎక్స్‌కవేటర్ సీజ్



పోలీసులు సీజ్ చేసిన ఎక్స్‌కవేటర్

పెండ్లిమర్రి, ఏప్రిల్ 5: మండలంలోని కొత్తగంగిరెడ్డిపల్లె గ్రామ పరివాహక ప్రాంతంలో పాపాఘ్ని నది నుంచి శుక్రవారం ఉదయం ఇసుక అక్రమ రవాణా చేస్తున్న టిప్పర్, ఇసుకను తవ్వుతున్న ఎక్స్‌కవేటర్‌ను పోలీసులు సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. కొత్తగంగిరెడ్డిపల్లె సర్పంచు ఇసుక అక్రమ తవ్వకాల, రవాణాను స్థానిక ప్రజలతో కలసి అడ్డుకుని జిల్లా ఎస్పీకి సమాచారం ఇచ్చారు. దీంతో పెండ్లిమర్రి పోలీస్ సిబ్బంది హుటాహుటిన అక్కడకు చేరుకుని ఎక్స్‌కవేటర్, టిప్పర్‌ను స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించారు. అక్రమ తవ్వకాల వల్ల భూగర్భజలాలు అడుగంటి తాగు, సాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే అనుమతులకు మించి తవ్వకాలు జరిపారన్నారు. అక్రమ తవ్వకాలు జరిపితే గ్రామస్థులతో కలిసి అడ్డుకుంటామని సర్పంచ్ హెచ్చరించారు.

వలంటీరు ఆత్మహత్య



జమ్మలమడుగు, ఏప్రిల్ 5: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని ప్రొద్దుటూరు రోడ్డు మేదర కాలనీ శివార్లలో శుక్రవారం మధ్యాహ్నం నాగస్వరం సునీత (25) అనే యువతి ఇంటిలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. ఆత్మహత్యకు పాల్పడిన నాగస్వరం సునీత వలంటీరుగా పనిచేస్తోంది. అయితే ఉన్నట్లుండి మధ్యాహ్నం ఇంటిలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించినట్లు అర్బన్ ఎస్ఐ-2 కల్పన తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి కేసు నమోదు చేస్తామని తెలిపారు. మృతురాలికి తల్లిమాత్రమే ఉందని, మృతురాలు మూడవ కుమార్తె అని ఎస్ఐ తెలిపారు.

జూదరుల అరెస్టు

మైలవరం, ఏప్రిల్ 5: మండల పరిధిలోని కరమలవారిపల్లి బైపాస్ రోడ్డు సమీపంలో జూదమాడుతున్న 26 మందిని అరెస్టు చేసినట్లు మైలవరం ఎస్ఐ రెడ్డిసురేష్ శుక్రవారం తెలిపారు. జూదమాడుతున్న వారంతా చిన్నకొమెర్ల గ్రామానికి చెందిన వారేనని, వారి వద్ద నుంచి నుంచి రూ.1.21 లక్షల నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళ అనుమానాస్పదస్థితిలో మృతి

చెన్నూరు, ఏప్రిల్ 5: మండలంలోని శాటిలైట్ సిటీలో నివాసం ఉంటున్న జింకా లక్షుమ్మ (45) అనుమానాస్పదస్థితిలో మృతి చెందినట్లు సీఐ పార్థసారధి తెలిపారు. ఒంటిమిట్ట మండలం మాధవరానికి చెందిన ఆ మహిళ 15 సంవత్సరాల క్రితం భర్తతో విడిపోయి శాటిలైట్ సిటీలో నివాసం ఉంటుంది. కాగా 12వ బ్లాక్‌లోని మూడో అంతస్తులో ఆమె నివాసం ఉంటుండగా.. ఆ బ్లాక్ మొత్తం చాలా కాలంగా పూర్తిగా ఖాళీగా ఉంటూ ఒక్కటే నివశిస్తోంది. ఆమెకు ఇద్దరు పిల్లలు ఉండగా వారికి వివాహం జరగింది. ప్రస్తుతం ఆమె అక్కడక్కడా ఇళ్లల్లో పనిచేసుకుంటూ జీవనం సాగి స్తూ... అనుమానాస్పదస్థితిలో మృతి చెందింది. మృతదేహం బాగా ఉబ్బిపోయి దుర్వాసన రావడంతో స్థానికులు ఇచ్చిన సమాచారంతో శుక్రవారం రాత్రి సీఐ తన సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. మూడురోజుల క్రితమే మృతి చెంది ఉండవచ్చని.. మృతికి కారణాలు తెలి యాల్సి ఉందన్నారు. అనుమానాస్పదస్థితి కింద కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

స్వగ్రామం చెన్నరాయునిపల్లెకు విచ్చేసిన లోకాయుక్తా జస్టీస్ లక్ష్మణ్‌రెడ్డి

పెద్దతిప్పసముద్రం ఏప్రిల్ 5: ఆంధ్రప్రదేశ్ లోకాయుక్తా జస్టీస్ లక్ష్మణ్ రెడ్డి వేసవి విడిదికి తన స్వగ్రామమైన టి.సదుం పంచాయతీ చెన్నరాయునిపల్లెకు శుక్రవారం చేరుకున్నారు. చెన్నరాయునిపల్లెలో కర్ణాటక డీఎస్పీ కృష్ణా, పీటీఎం రెవెన్యూ అధికారులు, పీటీఎం ఎస్ఐ రవీంద్ర బాబు తన సిబ్బందితో అక్కడికి చేరుకుని ఆయనకు ఘన స్వాగతం పలికారు. చెన్నరాయునిపల్లెలో ఆయన ఈనెల 13వ తేదీ వరకు స్వగృహంలో ఉంటారు 14వ తేదీన ఉదయం తిరిగి కర్నూల్‌కు వెళతారు. ఆయనకు స్వాగతం పలికిన వారిలో మొలకలచెరువు మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ శ్రీనాథ్‌రెడ్డి, మనోజ్ జయంత్‌రెడ్డి, మంజునాథ్‌రెడ్డిలతో పాటు రెవెన్యూ అధికారులు పోలీసులు, గ్రామస్థులు ఉన్నారు.

స్థల వివాదమై ఘర్షణ.. మహిళపై దాడి

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 5: ఆవులు కట్టే స్థల వివాదమై వరుసకు అక్కఅయ్యే మహిళపై ఓ వ్యక్తి దాడి చేసిన సంఘటన శుక్రవారం జరిగింది. బాధితుల కథనం మేరకు మదనపల్లె మండలం పోతబోలు పంచాయతీ భూకవారిపల్లెకు చెందిన వెంకటరమణ భార్య రాజమ్మ(60) దంపతులు ఊరి బయట చెట్టు కింద ఆవులు కట్టేసుకుని అక్కడే గడ్డి వేసి మేపుతున్నారు. కాగా ఈ స్థలం తమదే అంటూ రాజమ్మ పెద్దనాన్న కుమారుడు వెంకటర మణ అక్కడికి వచ్చి ఆవులను తమ స్థలంలో కట్టవద్దని హెచ్చ రించాడు. ఈ స్థలం ఊరి స్థలమని రాజమ్మ చెప్పడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో వెంకటరమణ కర్రతో రాజమ్మ తలపై దాడి చేయడంతో గాయపడిన ఆమెను గ్రామస్థులు మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు అవుట్ పోస్టు పోలీసులు తాలూకా పోలీసులకు సమాచారం అందించారు.

ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్

మైదుకూరు, ఏప్రిల్ 5: ఎన్నికల ప్రవర్తనా నియమా వళిని ఉల్లంఘించారంటూ మండలంలోని విశ్వనాథపు రం పంచాయతీ ఉపాధిహామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ ఆకుల సంజీవ రాయుడిని ఎన్నికల సంఘం అధి కా రులు సస్పెండ్ చేశారు. గత నెల 27న ప్రొద్దుటూరులో జరిగిన అధికార పార్టీ బస్సు యాత్రకు రాజకీయ నాయకులతో కలసి బస్సులో వెళ్లినట్లు తెలుగుదేశం పార్టీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ సాక్ష్యాలతో ఫిర్యాదు చేశారు. ఈమేరకు పీడీ విచారణ జరిపి చర్యలు చేపట్టాలని సిఫారసు చేయడంతో సస్పెండ్ చేసినట్లు ఆర్వో చంద్రమోహన్ తెలిపారు.

భార్యపై అలిగి భర్త ఆత్మహత్యాయత్నం

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 5: భార్యపై అలిగిన ఓ యువకుడు ఆత్మహత్యకు యత్నించాడు. కురబలకోట మండలం అంగళ్లు పంచాయతీ చేనేతనగర్‌కు చెందిన ఖాదర్‌బాషా కుమారుడు మస్తాన్(31)కు ఏడేళ్ల క్రితం వివాహమైంది. ఈ క్రమంలో శుక్రవారం భార్య, భర్తలు ఇద్దరు గొడవ పడటంతో భార్యపై అలిగిన మస్తాన్ పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. అతడిని మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కాకర్లవారిపల్లెనే పోలీసులు టార్గెట్ చేయడం దుర్మార్గం

పెనగలూరు, ఏప్రిల్ 5: మండలంలో 140 గ్రామాలు ఉన్నప్పటికీ కాకర్ల వారిపల్లెను టార్గెట్ చేస్తూ 10 రోజుల వ్యవధిలో మూడుసార్లు తనిఖీల పేరుతో పోలీసులు అరాచకాలు సృష్టించడం దుర్మార్గమైన చర్యగా రైల్వేకోడూరు నియోజకవర్గ ఇన్‌చార్జి రూపానందరెడ్డి, మాజీ టీడీపీ ఇన్‌చార్జి కస్తూరి విశ్వనాథనాయుడులు వేర్వేరుగా పేర్కొన్నారు.
రాజంపేట రూరల్ సీఐ మంజునాథరెడ్డి, పెనగలూరు, రాజంపేట ఎస్ఐల పర్యవేక్షణలో ఎస్ఎస్‌డి బృందాలచే గ్రామంలోని ఇళ్లల్లో ఎటువంటి సర్చ్ వారెంట్ లేకుం డా సోదాలు చేపట్టడం నీచమైన చర్య అన్నారు. కాకర్లవారిపల్లె గ్రామస్తులు ఏమైనా సంఘ విద్రోహశక్తులా అని ప్రశ్నించారు. శుక్రవారం కాకర్లవారిపల్లె గ్రామాన్ని రూపానంద రెడ్డి, విశ్వనాధనాయుడుల బృందాలు వేర్వేరుగా సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో కొన్ని సమస్యాత్మక గ్రామాలు ఉన్నప్పటికీ కాకర్ల వారిపల్లె గ్రామం లోనే పది రోజుల వ్యవధిలో నాలుగుసార్లు కవాతు నిర్వహించడం, చివరకు ముగ్గురు ఎస్ఐలను వెంటపెట్టుకొని రూరల్ సీఐ మంజునాథరెడ్డి ఈ దుశ్చర్యకు పాల్పడటం సిగ్గుచేటన్నారు. ఈ విషయంపై రూపానందరెడ్డి గ్రామస్తుల సమక్షంలో రాజంపేట డీఎస్పీ చైతన్యతో ఫోన్‌లో మాట్లాడారు. మరోసారి ఇలా జరగకుండా చూస్తానని డీఎస్పీ చెప్పడంతో రూపానందరెడ్డి గ్రామస్తులకు విషయం చెప్పి అక్కడ నుంచి వెళ్లిపో యారు. అనంతరం గ్రామస్తులు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్, ఎస్పీ కృష్ణారావును కలిసి సమస్యను వివరించినట్లు తెలిపారు.

రాష్ట్ర సంక్షేమం, అభివృద్ధి టీడీపీకే సాధ్యం

● పుత్తా ఆధ్వర్యంలో 110 కుటుంబాలు చేరిక

వల్లూరు, ఏప్రిల్ 5 : రాష్ట్ర సంక్షేమం, అభివృద్ధి టీడీపీకే సాధ్యమని కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్, టీడీపీ ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, అయన తనయుడు క్రిష్ణచైతన్యరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మం డల కేంద్రమైన వల్లూరులోని సి.కొత్తపల్లె, లింగాయపల్లె, ఇసుకపల్లె గ్రామాల్లో ఇంటింటి ప్రచారాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి టీడీపీ అధికారంలోకి రాగానే అమలు చేసే పథకాల గురించి వివరించారు. ఓటర్లు తమ ఓటును సైకిలు గుర్తుపై వేసి గెలిపించాలని కోరారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి ఇంటికీ దీపం కింద గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, ఆడబిడ్డ పథకం కింద 18 ఏళ్లు పూర్తయిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 చొప్పున ఇంట్లో ఎంత మంది ఆడపిల్లలు ఉంటే అంత మందికి రూ.1500 అలాగే యువతకు రూ.3వేలు, అన్నదాతలకు ప్రతి యేటా 20వేలు, పింఛను దారులకు రూ.4 వేలు పింఛను అందిస్తామన్నారు. ఇవన్నీ జరగాలంటే రానున్న ఎన్నికల టీడీపీకి అఖండ మెజార్టీతో గెలిపించాలన్నారు. ముఖ్యంమగా బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసమే టీడీపీ ధ్యేయం అని, ఏపీ ప్రజలంతా టీడీపీ చంద్రబాబు వైపు చూస్తున్నరన్నారు.

పుత్తా ఆధ్వర్యంలో 110 కుటుంబాలు చేరికలు

ఇంటింటి ప్రచారంలో భాగంగా పుత్తా నరసింహారెడ్డి, క్రిష్ణ చైతన్యరెడ్డి ఆధ్వర్యంలో 110 కుటుంబాల వారు వైసీపీ నుంచి టీడీపీ తీర్థాన్ని పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వారు పార్టీ కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. గంగాయపల్లె, ఇసుకపల్లె, లింగాయపల్లె గ్రామాల్లోని వైసీపీకి చెందిన ముఖ్యనేతలు టీడీపీలో చేరారు. టీడీపీ మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ వేణుగోపాల్‌రెడ్డి, రవీంద్రనాథరెడ్డి, చిట్టిబాబు, సురేష్, గడికోట సుధాకర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, చంద్రారెడ్డి, సుబ్బారెడ్డి, రామక్రిష్ణారెడ్డి, పుల్లగూర శ్రీనివాసులు, హరిక్రిష్ణయాదవ్, ఓబులరెడ్డి, ఏటూరు రామచంద్రరెడ్డి, హృదయరెడ్డితో పాటు పలువురు మైనార్టీ ముస్లింనేతలు, బీసీ నాయకులు, ఎస్సీ సెల్ నాయకులు పాల్గొన్నారు

కూటమిదే అంతిమవిజయం

కూటమిదే అంతిమ విజయమని టీడీపీ ఉపాధ్యక్షుడు, కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుత్తా నరసింహారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన వల్లూరులో జనసేన నేత వేణుగోపాల్‌రెడ్డి, బీజేపీ నాయకులు రాంప్రసాద్ రెడ్డి, యువనేత చైతన్యరెడ్డి ఆధ్వర్యంలో విలేకరులతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ అరాచకాలను ప్రజలు తెలుసుకున్నారని, అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడేనన్నట్లుగా ఉందన్నారు. కేవలం ధనార్జన, స్వలాభాపేక్షతోనే వైసీపీ పనిచేస్తోందన్నారు. పెండ్లిమర్రి మండలంలో జరిగిన హత్యకు సంబంధించి కేసుపై నిర్వీర్యం చేసే ఆలోచనలో ఉన్నారని, ప్రజలు అంతా గమనిస్తున్నారన్నారు. సొంత భూములు సైతం వైసీపీ లాక్కుకోవడం దారుణమన్నారు. 2014లో ఎన్‌డీఏ కూటమిలో ఏపీ అభివృద్ధి చెందింది, ఇప్పుడు ఇంకా పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందాలన్న ఉద్దేశ్యంతో చంద్రబాబు, పవన్ కలిసి ఎన్‌డీఏలో చేరారన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు. ఈ సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి, రవీంద్రనాథరెడ్డి, గడికోట సుధాకర్‌రెడ్డి, కరీం, సుబ్బారెడ్డి, రామసుబ్బారెడ్డి, ఎస్సీసెల్ నేత పుల్లగూర శ్రీనివాసులు, సుదర్శన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, కూటమి నేతలు పాల్గొన్నారు.





వల్లూరు: పార్టీలో చేరిన వారితో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి... చెన్నూరు మండలం ముండ్లపల్లె ప్రచారంలో పుత్తా సరళమ్మ, శ్రీచైతన్య

టీడీపీని ఆదరించి అభివృద్ధిని అందుకోండి

- పుత్తా సరళమ్మ, శ్రీచైతన్య ప్రచారం

చెన్నూరు, ఏప్రిల్ 5 : ప్రజలు టీడీపీని ఆదరించి ప్రతి ఇంటా అభివృద్ధిని అందుకోవాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా సతీమణి సరళమ్మ, కోడలు శ్రీచైతన్య అన్నారు. శుక్రవారం మండలంలోని ముండ్లపల్లె, రాచిన్నాయపల్లె గ్రామాల్లో ఆ గ్రామ సీనియర్ టీడీపీ నేతలు ముండ్ల రాజశేఖర్‌రెడ్డి, కనుపర్తి గిరిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో బాబుతోనే భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించి ఇంటింటా తిరిగి టీడీపీకి ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. విచ్చలవిడిగా మద్యం, హత్య లు, రైతుల ఆత్మహత్యలు ఇలా వైసీపీ హయాంలో ప్రజలు విసిగిపోయారన్నారు. దివంగత టీడీపీ నేత జ్యోతిరెడ్డి సతీమణి శివకుమారి, మండల కన్వీనరు విజయభాస్కర్‌రెడ్డి, ఐటీడీపీ యామల మణికంఠ, ఉప సర్పంచ్ షేక్ అబ్దుల్లా, ముత్తరాసు వెంకటసుబ్బయయ్య రాఘవయ్య, టీడీపీ సీనియర్ నేతలు వెంకటరమణ, గిరిధర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శేఖర్, ఉసేన్, వంటల నారాయణ, భవానీ ఆచారి, క్లస్టర్ ఇన్‌చార్జ్ తాడిగోట్ల వెంకటసుబ్బారెడ్డి, గోసుల శ్రీవాణి పాల్గొన్నారు.

అవకాశం ఇవ్వండి అభివృద్ధి చేసి చూపిస్తా: బీటెక్ రవి

లింగాల, ఏప్రిల్ 5: పులివెందుల ఎమ్మెల్యేగా తనకు అవకాశం ఇవ్వండి అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తానని టీడీపీ అభ్యర్థి మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి (బీటెక్ రవి) అన్నారు. శనివారం బీటెక్ రవి ఆయన సతీమణి లతారెడ్డి, కుమారుడు రామ్‌రెడ్డిలతో కలిసి లింగాల మండలంలోని ఇంటికబయ్యపల్లె, రామాపురం, కమ్మవారిపల్లె గ్రామాలలోప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి మేనిఫెస్టోను వివరించారు. టీడీపీ మండల ఇన్‌చార్జి విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

తొండూరు మండలంలో... తొండూరు మండలంలోని పాలూరు గ్రామంలో బీటెక్ రవి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. తనకు ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు భరత్‌రెడ్డి, శివమోహన్‌రెడ్డి, బీజేపీ, జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తొండూరు మండలంలో టీడీపీకి ఓటు వేయాలని కోరుతున్న బీటెక్ రవి

ఇఫ్తార్ విందులో పాల్గొన్న శ్రీనివాసరెడ్డి



కడప నగరం శంకరాపురంలో శుక్రవారం సాయంత్రం టీడీపీ నాయకులు ట్రాన్స్‌పార్మర్ శ్రీను ఆధ్వర్యంలో ఇఫ్తార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చినబాబు, రాజగోపాల్‌రెడ్డి, జనసేన నాయకులు తుంగా రమణయ్య, శివ, నాగేంద్ర, హైమావతి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

నేడు బడే రాత్

కడప (నాగరాజుపేట), ఏప్రిల్ 5:పవిత్రమైన బడే రాత్ పండుగ ఈ నెల 6న నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ ఖ్వాజీ, బుఖారియా మస్జిద్ ఇమాంఒ ఖతిబ్, ముతవల్లి సయ్యద్ సిరాజుద్దీన్ బుఖారిసాహెబ్ పేర్కొన్నారు. శుక్రవారం కడప నగరంలోని ట్రంకు రోడ్డులో ఉన్న ప్రభుత్వ ఖ్వాజీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పవిత్రమైన రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఈ నెల 6న రవీంద్ర నగర్‌లోని బుఖారియా మస్జిద్‌లో రాత్రి 9గంటలకు షబ్బేఖాదర్ ప్రార్థనలతో పాటు ఆధ్యాత్మిక సందేశాలు ఉంటాయని, ముస్లింలు భక్తిశ్రద్ధలతో పండుగ జరుపుకోవాలని కోరారు.

రిమ్స్ స్టేషన్ పరిధిలో పోలీసు కవాతు

కడప (క్రైం), ఏప్రిల్ 5 :ఎస్పీ సిద్దార్థ కౌశల్ ఆదేశాల మేరకు కడప రిమ్స్ పోలీసుస్టేషన్ పరిధిలో శుక్రవారం సాయంత్రం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. కడప రిమ్స్ సీఐ కె.రామచంద్ర ఆధ్వర్యంలో రిమ్స్ ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి, ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఆర్కేనగర్, తిలక్‌నగర్, చలమారెడ్డిపల్లి, బీడీకాలనీ తదితర ప్రాంతాల మీదుగా ఫ్లాగ్‌మార్చ్ కొనసాగింది. ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ప్రజల్లో ఉన్న భయాందోళనలను పోగొట్టి ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా ప్రశాంత వాతావరణం కల్పించడమే తమ ధ్యేయమని పేర్కొన్నారు.

వైసీపీకి మరో ఛాన్స్ ఇస్తే నిలువుదోపిడీ

● శ్రీనివాసరెడ్డి, మాధవీరెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 5:ఐదేళ్ల క్రితం ఒక్క ఛాన్స్ అని వైసీపీ నాయకులు ప్రజలు ఓట్లేసి గెలిపిస్తే రాష్ట్రాన్ని నిలువునా దోచేశారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కడప నగరం 47వ డివిజన్ ఇక్బాల్ రైస్‌మిల్ వద్ద ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక చేపట్టబోయే పథకాల గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జనార్దన్, హుస్సేన్, బుజ్జి, రాంప్రసాద్‌రెడ్డి, జిలానీ తది తరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న టీడీపీ కడప నియోజకవర్గ అభ్యర్థి మాధవీరెడ్డి

నేడు కడపలో వైఎస్ షర్మిలా రెడ్డి పర్యటన


కడప(కలెక్టరేట్), ఏప్రిల్ 5: ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర అధ్యక్షురాలు, కడప పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిని వైఎస్ షర్మిలా రెడ్డి శనివారం కడప నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పర్యటించ నున్నట్లు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి అభిమానులు, కాంగ్రెస్ కార్యకర్తలు, నేతలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. వైఎస్ షర్మిలా రెడ్డి శుక్రవారం ఉదయం 9-30 గంటలకు అమీన్ పీర్‌దర్గాను సందర్శించి ప్రార్థనలు చేస్తారు. 10-30 గంటలకు మాసాపేట సర్కిల్‌లో, 11-20కి దేవుని కడపలో, ప్రచారం నిర్వహించి 11-30కు అశోక్ నగర్‌లో సమావేశం నిర్వహిస్తారు. అప్సర సర్కిల్ మీదుగా వై- జంక్షన్ అంబేద్కర్ సర్కిల్, మీదుగా కాంగ్రెస్ కార్యాలయానికి చేరుకుంటారు. సాయంత్రం 4-45 గంటలకు సంధ్య థియేటర్ మీదుగా మరియాపురం చేరుకుని సెయింట్ జోసఫ్ చర్చిలో ప్రార్థనలు నిర్వహిస్తారు. బిల్టప్, వినాయక నగర్, మీదుగా చిలుకలబావి, గోకుల లాడ్జీల, 7 రోడ్స్ వరకు రోడ్ షో నిర్వహించి అక్కడ సమావేశం నిర్వహిస్తారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయ వంతం చేయాలని ఆయన పేర్కొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కమలాపురం రూరల్, ఏప్రిల్ 5 : కమలాపురం మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జ్యోతి తెలిపారు. శనివారం ఉదయం 11గంటలకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో మండల సమావేశం ఏర్పాటు చేశామని, ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండల అధికారులు తప్పకహాజరు కావాలన్నారు. సమావేశంలో ఆయా శాఖలకు సంబంధించిన పూర్తి సమాచారంతో రావాలని ఆమె సూచించారు.

'టీడీపీ ఖాళీ అనడం హాస్యాస్పదం'

వీరపునాయునిపల్లె, ఏప్రిల్ 5: మండలంలోని మొయిళ్లచెరువు గ్రామంలో టీడీపీ ఖాళీ అయిందని వైసీపీ నాయకులు అనడం హాస్యాస్పదంగా ఉం దని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం వీరపునాయునిపల్లె టీడీపీ కార్యాలయంలో టీడీపీ కన్వీనర్ బైరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, తిరుమలరెడ్డి, బాలగంగిరెడ్డి, రామకృష్ణారెడ్డి, రామాంజనేయ రెడ్డి, రామానుజన్‌రెడ్డి, నరసింహారెడ్డి మాట్లాడుతూ కొమ్మ ద్ది, మొయిళ్లచెరువు చుట్టుపక్కల గ్రామాల నుంచి సాయినాథ్‌శర్మ వర్గీయులను మొయిళ్లచెరువుకు రప్పించి ఎమ్మెల్యే ఎంపీ సమక్షంలో టీడీపీ నుం చి వైసీపీలోకి చేర్చుకున్నామని, దీంతో గ్రామంలో టీడీపీ ఖాళీ అయిందని డబ్బా కొట్టుకుంటున్నారన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

జగ్జీవన్‌రామ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి







కడప నగరంలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి... మాట్లాడుతున్న వైస్ చాన్సలర్ అంజనేయప్రసాద్... సీపీఐ ఆధ్వర్యంలో నివాళులర్పిస్తున్న దృశ్యం

కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 5: బాబు జగ్జీవన్‌రామ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని కడప నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్.మాధవీరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కడప నగరం కొత్తకలెక్టరేట్ సమీపంలోని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహోన్నతమైన వ్యక్తి బాబు జగ్జీవన్‌రామ్ అన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

పేదల పెన్నిది బాబు జగజ్జీవన్‌రామ్

బాబు జగ్జీవన్‌రామ్ పేదల పెన్నిది అని ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, మేయర్ సురేష్‌బాబు, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. శనివారం కడప నగరం వైసీపీ జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ కులాలకు, మతాలు, పార్టీలకతీతంగా జగ్జీవన్‌రామ్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. జగ్జీవన్‌రామ్ ఓ పేద కుటుంబంలో జన్మించి దేశానికే ఉప ప్రధానిగా పనిచేసిన వ్యక్తి అని కొనియాడారు.

అమీర్‌బాబు ఆధ్వర్యంలో...

టీడీపీ సీనియర్ నాయకులు అమీర్‌బాబు కడప నగరంలోని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతదేశ రక్షణ మంత్రిగా, కార్మిక మంత్రిగా అనేక చట్టాలు అమలు చేసి చైనా యుద్ధంలో విజయాన్ని సాధించిన బాబు జగ్జీవన్‌రామ్ చరిత్రలో చిరస్మరణీయుడుగా నిలుస్తారన్నారు.

బాబు జగ్జీవన్‌రామ్ చిరస్మరణీయుడు

బాబు జగజ్జీన్‌రామ్ చిరస్మరణీయుడని వైఎస్ఆర్ హార్టికల్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ అంజనేయ ప్రసాద్ అన్నారు. శనివారం ఏఎఫ్ఏయూలో ఆయన జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయనతో పాటు రిజిస్ట్రారు జగ్జీవనరామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులరిర్పంచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతిపిత మహాత్మాగాంధీ అభిప్రాయాలతో జగ్జీవన్‌రామ్ ఎక్కువగా ఏకీభవించేవారని, అంటరానితనాన్ని నిర్మూలించడానికి గాంధీ చేసిన ప్రయత్నాల్లో ఆయన చురుగ్గా పాల్గొన్నారన్నార. డిప్యూటీ రిజిస్ట్రారు రాజేష్‌కుమార్‌రెడ్డి, సూపరింటెండెంట్ వై.పవన్‌కుమార్‌రెడ్డి, నేషనల్ ఈవెంట్ కోఆర్డినేటరు మనోహర్, ఎన్ఎస్ఎస్ పీవో ప్రదీప్‌కుమార్, రమాదేవి దితరులు పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో...

కడప (సెవెన్‌రోడ్స్), ఏప్రిల్ 5 : పేద వర్గాల అభ్యున్నతికి అలుపెరగని కృషి చేసిన బాబు జగ్జీవన్‌రామ్ సేవలు మరువలేనివని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర కొనియాడారు. సీపీఐ కార్యాలయంలో దళిత హ క్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడేఉ గుంటి వేణుగోపాల్, చంద్రశేఖర్, గంగాసురేష్, సీపీఐ సీనియర్ నాయకులు పావన్ ససుధాకర్, డీహెచ్‌పీఎస్ కార్యదర్శి మునెయ్య పాల్గొన్నారు.

సామాజిక విప్లవ యోధుడు...

కడప (మారుతీనగర్), ఏప్రిల్ 5: సామాజిక విప్లవ యోధుడు బాబు జగ్జీవన్‌రామ్ అని పలు పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు కొనియాడారు. శుక్ర వారం స్థానిక మహావీర్ సర్కిల్ వద్దగల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గొప్ప సమతావాది జగ్జీవన్ రామ్ అని ఆంధ్రప్రదేశ్ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (పేరుపోగు వర్గం) రాష్ట్ర నాయకుడు గొడుగునూరు మునెయ్య, జిల్లా అధ్యక్షుడు తప్పెట శివ కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు, మైదుకూరు ఇన్‌చార్జ్ మిద్దె వెంకటరమణ, కార్యదర్శి కె. వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు జగ్జీవన్‌రామ్: లక్ష్మీరెడ్డి

వివక్షతను కూకటివేళ్లతో పెకిలించిన గొప్ప ఆదర్శప్రాయుడు బాబు జగ్జీవన్‌రామ్ అని టీడీపీ సీనియర్ నాయకుడు జి.లక్ష్మీరెడ్డి కొనియాడారు. స్థానిక మహావీర్‌సర్కిల్ వద్ద గల జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. టీడీపీ 19వ డివిజన్ ఇన్‌చార్జ్ స్వర్ణలత, నాయకులు ఓబుల్‌రెడ్డి, బొజ్జారెడ్డి పాల్గొన్నారు.

ధీశాలి బాబు జగ్జీవన్‌రామ్: అవ్వారు

ధీశాలి బాబు జగ్జీవన్‌రామ్ అని జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున కొనియాడారు. జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకుని కడపలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళర్పించారు. మాదిగ మహానాడు జిల్లా అధ్యక్షుడు గున్నా జయరాములు, నాయకులు పాల్గొన్నారు.

మహనీయుడు జగ్జీవన్‌రామ్

బాబు జగ్జీవన్‌రామ్ మహనీయుడు అని తొగట వీరక్షత్రియ సాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు మడక చక్రధర్ కొనియాడారు. స్థానిక కడపలోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఆయన పూలమాల నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో చెమ్ముమియాపేట మాజీ సర్పంచ్ రాంప్రసాద్‌రెడ్డి, సర్పంచ్ రెడ్డిహుస్సేన్, శేఖర్, సద్దాంహుస్సేన్ పాల్గొన్నారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి...

అణగారిన వర్గాల ఆశాజ్యోతి బాబు జగ్జీవన్‌రామ్ అని గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు, నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర కన్వీనరు షేక్ సిద్దిక్ అన్నారు. ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జీఆర్ఎస్‌వైఎఫ్ నగర ప్రధాన కార్యదర్శి తరుణ్, నాయకులు నవీన్, హనీఫ్, దీపక్, శ్రావణ్ పాల్గొన్నారు.

కమలాపురంలో...

మహాజన సమితి రాష్ట్ర అధ్యక్షుడు యామవరం చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళుర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ భారత స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించారన్నారు. అలాంటి మహనీయుల ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అబ్రహం, రాయప్ప, పుల్లయ్య పాల్గొన్నారు.

పులివెందులలో...

బడుగు బలహీర వర్గాల అభ్యున్నతికి కృషిచేసిన వ్యక్తి బాబు జగ్జీవన్‌రామ్ అని ఆహార విజ్ఞాన, శాస్త్ర సాంకేతిక కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.ఎస్.బేగ్ అన్నారు. శుక్రవారం జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా కళాశాలలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ జయమ్మ, అరుణ, డాక్టర్ కీర్తిరెడ్డి, డాక్టర్ రాజేష్, డాక్టర్ నివేదిత, డాక్టర్ సాయి శ్రీనివాస్, డాక్టర్ రాజశేఖర్, కళాశాల విద్యార్థినీ విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



విగ్రహానికి పూలమాల వేస్తున్న చక్రధర్



పూలమాల వేస్తున్న గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమాఖ్య నాయకులు



చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న చంద్రశేఖర్







జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న లక్ష్మీరెడ్డి... నివాళి కార్యక్రమంలో ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు... పులివెందులలో నివాళులర్పిస్తున్న డీన్, అధ్యాపకులు, విద్యార్థులు

బకాయిలు చెల్లించడంలో రాష్ట్ర ప్రభుత్వ విఫలం

బద్వేలు, ఏప్రిల్ 5: ఉద్యోగ, ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను చెల్లించడంలో పూర్తిగా విఫలమైందని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదన విజయ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన 25వేలకోట్ల బకాయిలలో 5500 కోట్లలను మార్చి ఆఖరిలోగా చెల్లిస్తామని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చాందన్నారు. హామీ మేరకు ప్రావిడెంట్ ఫండ్, ఏపీజీఎల్ఐ బకాయిలను కొంతేరకు చెల్లించిందని, అయితే ఇచ్చిన హామీ మేరకు పూర్తిస్థాయిలో బకాయిలను చెల్లించడంలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ గోపవరం మండల అధ్యక్షుడు క్రిష్టఫర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఉద్యమనిర్మాత వీణా విజయరామరాజు

పోరుమామిళ్ల, ఏప్రిల్ 5 : ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాత విద్యారంగ సంక్షేమం కోసం జీవితం ధారబోసిన మహానుభావుడు వీణా విజయరామరాజు అని ఎస్టీయూ అదనపు ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి అన్నారు. శుక్రవారం పోరుమామిళ్లలోని ఎస్టీయూ భవన్‌లో వీణా విజయరామరాజు వర్ధంతిలో మరియుబాబు జగజ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్లు సుబ్రమణ్యం, చంద్రహాసరెడ్డి, సుబ్బారెడ్డి జిల్లా కార్యవర్గసభ్యులు శేఖర్‌బాబు, కుళాయప్ప, రాజగోపాల్‌రెడ్డి, రవీంద్రబాబు, పుల్లయ్య పాల్గొన్నారు.

రెడ్డికొట్టాలలో బొజ్జా రోశన్న ఇంటింటి ప్రచారం



రెడ్డికొట్టాలలో ఇంటింటి ప్రచారంలో ఉమ్మడి అభ్యర్థి బొజ్జా రోశన్న

కాశినాయన ఏప్రిల్ 5 : బద్వేల్ నియోజకవర్గంలో జనసేన,బీజేపీ, టీడీపీ ఉమ్మడి అభ్యర్థిగా బరిలోఉన్న బొజ్జా రోశన్న శుక్రవారం రెడ్డికొట్టాలలో కమలం గుర్తుకు ఓటేసి గెలిపించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బంగారు గుర్విరెడ్డి,మండల అధ్యక్షుడు మురుకూటి రాజారెడ్డితో కలిసి ఉమ్మడి మినీ మేనిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంచారు. ఈకార్యక్రమంలో తెలుగు యువత అధ్యక్షుడు పంగా రవీంద్రారెడ్డి, ఓ.రోహిత్‌రెడ్డి, ఎం.విజయ్‌కుమార్‌రెడ్డి, కొండా దుగ్గిరెడ్డి ,రామసుబ్బారెడ్డి, బీజేపీ నాయకుడు షకీల్ బేగం, జనసేన పార్టీ నాయకులు పుల్లారు ఖలీల్ ఇతర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కువైత్‌లో ఇఫ్తార్ విందులో రితీశ్‌కుమార్‌రెడ్డి



కువైత్‌లో ఇఫ్తార్ విందులో పాల్గొన్న రితీశ్‌రెడ్డి

బద్వేలు టౌన్, ఏప్రిల్ 5 : రంజాన్ మాసం పురస్కరించుకుని శుక్రవారం కువైత్‌లో బద్వేలు నియోజకవర్గ టీడీపీ సమన్వయ కర్త రితీశ్‌కుమార్‌రెడ్డి కువైత్‌లో టీడీపీ నాయకులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రితీష్‌రెడ్డి మాట్లాడుతూ 2024లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కువైత్‌లో ఉన్న బద్వేలు నియోజకవ్గవాసులను కలుసుకునివారి కష్టసుఖాలు తెలుసుకుని రాబోవు ఎన్నికల్లో బీజేపీ, టీడీపీ, జనసేన కూటమిలకు కుటుంబ సభ్యులతో సహా మద్దతునివ్వాలని కోరారు. చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవాలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బద్వేలు నియోజకవర్గవాసులు, ముస్లింలు పాల్గొన్నారు.

వైసీపీ అరాచక పాలనను అంతం చేద్దాం

వైసీపీ నుంచి పలు కుటుంబాలు టీడీపీలో చేరిక



టీడీపీలో చేరిన కార్యకర్తలతో వరదరాజులరెడ్డి

ఖాజీపేట, ఏప్రిల్ 5: వైసీపీ అనుసరిస్తున్న అరాచక పాలనను సార్వత్రిక ఎన్నికల్లో కలిసికట్టుగా అంతం చేద్దామని మైదుకూరు టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పత్తూరు పంచాయతీలోని నాగపట్నం, డాంఖాన్‌పల్లె గ్రామానికి చెందిన గడ్డం గంగినాయుడు, గడ్డం రామచంద్ర, గడ్డం రాముడు, రామచంద్ర, పొట్టి ఓబులు అనుచర వర్గం మండల అధ్యక్షుడు తిప్పిరెడ్డి లక్ష్మీరెడ్డి ఆధ్వర్యంలో పుట్టా సుధాకర్‌యాదవ్ సమక్షంలో దాదాపు 50 కుటుంబాలు కండువా కప్పుకుని పార్టీలో చేరాయి. ఈ కార్యక్రమంలో పెద్దపోతు అంజి, శ్రీనివాసులు, వీరభద్ర, మల్లికార్జున, గంగాప్రసాద్, పెద్దనరసింహులు, చిన్న నరసింహులు, నాయబ్‌రసూల్, నారాయణ, ఓబులేసు, హరి, నాగరాజు, శివక్రిష్ణ, అంకయ్య, యామయ్య, మండల నాయకులు వాకమల్ల వెంకటరామిరెడ్డి, మైదుకూరు బీజేపీ ఇన్‌చార్జి సుబ్బరాయుడు, జనసేన ఇన్‌చార్జి మల్హోత్ర, మాజీ జడ్పీటీసీ గోవిందురెడ్డి, వెంకటసుబ్బయ్య, ఫరూక్, పిచ్చినాయుడు, పుల్లయ్యనాయుడు, రమేష్‌నాయుడు, జానకిరాం, జిలానీ, కమ్మా నరసింహులు, భాస్కర్‌రెడ్డి, బండి వెంకటేష్, చిన్న, పొట్టిరాముడు, సుబ్బయ్య, వీరయ్య, గోసుల యల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఒక్కఅవకాశం ఇవ్వండి ..అభివృద్ధి చేసి చూపిస్తా : పుట్టా

మైదుకూరు రూరల్ ఏప్రిల్ 5 : ఒక్క అవకాశం ఇవ్వండి



పుట్టా సుధాకర్‌యాదవ్ సమక్షంలో పార్టీలో చేరిన నాయకులు

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని మైదుకూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ తెలిపారు. మండలంలోని గంజికుంట పంచాయతీ గంజికుంట తాండా, తువ్వపల్లె గ్రామంలో శుక్రవారం టీడీపీ మేనిఫెస్టోలో భాగంగా సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలను ఇంటింటికి తిరిగి గ్రామస్థులకు వివరించారు.ప్రొద్దుటూరు పార్టీ ఆఫీసులో మైదుకూరు,చాపాడు,బి.మఠం,దువ్వూరు మండలాలకు చెందిన ఫొటో,వీడియోగ్రాఫర్లు పుట్టాతో సమావేశం అయ్యారు. పేద,మధ్యతరగతి కుటుంబాల నుంచి ఎక్కువ మంది ఉన్నామని తెలిపారు. టీడీపీ ప్రభుత్వం వస్తే మమ్మలను,మా కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. అనంతరం పుట్టా సమక్షంలో పార్టీ కండువాలను కప్పుకున్నారు.ఈ కార్యక్రమంలో ఫొటో,వీడియోగ్రాఫర్లతో పాటు అన్నవరం సుధాకర్‌రెడ్డి,యాపరాల చిన్నా,లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సోములవారిపల్లె పంచాయితీలో భారీగా టీడీపీలో చేరికలు

ప్రొద్దుటూరు , ఏప్రిల్ 5 : ప్రొద్దుటూరు మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు శేఖర్ యాదవ్ వుండే సోముల వారిపల్లె పంచాయతీ ఈశ్వరరెడ్డి నగర్‌లో వైసీపీకి కొత్తపల్లె సర్పంచ్ శివచంద్రారెడ్డి షాక్ ఇచ్చారు. శుక్రవారం సోములవారి పల్లె పంచాయతీలో 1వ ఎంపీటీసీ పరిధిలోని ఈశ్వర్‌రెడ్డినగర్‌లో శివచంద్రారెడ్డి ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన యువకులు పెద్దఎత్తున టీడీపీలో చేరారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి వారందరికీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు నంద్యాల కొండారెడ్డి, వీఎస్ ముక్తియార్, కామిశెట్టి బాబు, సానా విజయ భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు వంగనూరు మురళీధర్‌రెడ్డి, వైఎస్ మహ్మద్ గౌస్, మునీర్, ఘంటశాల వెంకటేశ్వర్లు, ఈవీ సుధాకర్‌రెడ్డి, బోగాల లక్ష్మీనారాయణమ్మ, తలారిపుల్లయ్య, వద్ది బాలుడు, కొనిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి,బీసీ నేత చల్లా రాజగోపాల్ యాదవ్, స్థానిక నేత బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి 115 కుటుంబాలు టీడీపీలోకి చేరిక

పోరుమామిళ్ల, ఏప్రిల్ 5 : వైసీపీ నుంచి 115 కుటుంబాల వారు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ సమక్షంలో టీడీపీలో చేరారు. శుక్రవారం సాయంత్రం పోరుమామిళ్ల పంచాయతీ పరిధిలోని శివానందనగర్‌లో వైసీపీకి చెందిన రామచంద్రయ్య, నరసింహులు, యల్లనూరు రమణయ్య, బొజ్జ చెన్నయ్య, మల్లెంకొండయ్య, వనిపెంట సుబ్బరాజు, దమ్మనపల్లె నాగరాజు సురేంద్ర, బొజ్జ పెద్దగురప్ప,బొజ్జ సుబ్బరాయుడు, నర్సింహులుతో పాటు 35 కుటుంబాల వారు టీడీపీలో చేరారు. అలాగే మల్లకతవ సమీపంలోని కళ్యాణమండపంలో దమ్మనపల్లె పంచాయతీకి చెందిన దమ్మనపల్లె, సుంకేసులపల్లె, మార్కాపురం, ఈదుళ్లపల్లె గ్రామాలకు చెందిన 80 కుటుంబాల వారు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమాల్లో పోరుమామిళ్ల మేజరు పంచయాతీ సర్పంచ్ యనమల సుధాకర్, మండల టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



దమ్మనపల్లెలో విజయమ్మ సమక్షంలో టీడీపీలో చేరిన కార్యకర్తలు

వైభవంగా నారాయణస్వామి ఆరాధన మహోత్సవాలు



బ్రహ్మంగారిమఠం, ఏప్రిల్ 5 : బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలోని బ్రహ్మంసాగర్ ప్రాజెక్టు సమీపంలో వెలసిన అవధూత నారాయణరెడ్డి యోగీంద్ర స్వామి 110వ ఆరాధన మహోత్సవాలు శుక్రవారం నుంచి ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఛైర్మన్ బొమ్ము శివనారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం ఉదయం ప్రత్యేక పూజలు, సత్యనారాయణస్వామివ్రతం, హోమాలు, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు నిర్వహించారు. రాత్రి 8గంటలకు వీరబ్రహ్మేంద్రనగర్ రామాలయం నుంచి నుంచి జెండా మెరవణినిర్వహించారు. రాత్రి 9గంటలకు హరికథా కాలక్షేపాన్ని కమిటీ సభ్యులు చేపట్టారు. అలాగే నిరంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఘనంగా గంగమ్మ తల్లి విగ్రహ పతిష్ఠ

కొండాపురం, ఏప్రిల్ 5: మండలంలోని మురుగంపల్లి గ్రామంలో శుక్రవారం గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి, కడప పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి దేవగుడి భూపేశ్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ఆది, భూపేశ్‌లకు ఎమ్మార్పీఎస్ మద్దతు



ఎన్డీయే కూటమికి మాదిగలు మద్దతు పలుకుతున్న దృశ్యం

జమ్మలమడుగు, ఏప్రిల్ 5: జమ్మలమడుగులో బీజేపీ కార్యాలయంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మద్దతు పలికారు. ఎన్డీకే కూటమికి ఎమ్మార్పీఎస్ సంపూర్ణ మద్దతును ప్రకటించినట్లు జమ్మలమడుగులోని ఎమ్మార్పీఎస్ నాయకులు తెలిపారు. జమ్మలమడుగులో ఎన్డీయే కూటమి అభ్యర్థులు అయిన ఎమ్మెల్యే అభ్యర్థి సి.ఆదినారాయణరెడ్డికి, టీడీపీ ఎంపీ అభ్యర్థి భూపేశ్‌రెడ్డికి మాదిగల సంపూర్ణ మద్దతు ప్రకటించి సార్వత్రిక ఎన్నిల్లో అత్యధిక మెజార్టీకోసం కృషి చేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు అన్నెం చిన్నసుబ్బయ్యయాదవ్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎం.వెంకటేష్, జమ్మలమడుగు ఎమ్మార్పీఎస్ నాయకులు వై.చిన్నయ్య, నరసింహులు, బీజేపీ నాయకులు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

భూపేశ్‌రెడ్డిని ఆదరించండి : మాజీ ఎమ్మెల్సీ



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ నారాయణరెడ్డి

జమ్మలమడుగు, ఏప్రిల్ 5: సార్వత్రిక ఎన్నికల్లో కడప టీడీపీ ఎంపీ అభ్యర్థిగా భూపేశ్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించి ఆశీర్వదించాలని మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి కార్యకర్తలకు, నాయకులను కోరారు. శుక్రవారం రాత్రి జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని ప్రొద్దుటూరు రోడ్డులో టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎన్డీయే కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఆదినారాయణరెడ్డి, ఎంపీ అభ్యర్థి భూపేశ్‌రెడ్డిని ప్రజలకు, కార్యకర్తలకు పరిచయక కార్యక్రమానికి సంబంధించి సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ జమ్మలమడుగులో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఇచ్చిన హామీలు ఒక్కటీ నెరవేరలేదన్నారు. ముఖ్యమంత్రి వేసిన శిలాఫలకాలు నిరుద్యోగులకు మోసం చేస్తున్నాయన్నారు. ఆర్టీపీపీలో కార్మికులకు జీతాలు పెంచలేదని రెగ్యులర్ చేస్తానని మోసం చేశారన్నారు. అనంతరం దేవగుడి గోపాల్‌రెడ్డి జగన్ మోసాలను కార్యకర్తలకు తెలియజేసి విమర్శించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డితోపాటు ఆయన ఎమ్మెల్యేలు, మంత్రులు, మాఫియాలాగా రాజ్యాన్ని నడుపుతున్నారన్నారు. జనసేన నాయకులు వివేక్, నాగార్జున మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి రాక్షస పాలన దించాలన్నారు. జమ్మలమడుగులో అబ్బాయి, బాబాయిని గెలిపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి పొన్నతోట శ్రీనివాసులు , బీజేపీ నాయకులు యల్లారెడ్డి, దేవగుడి శివనారాయణరెడ్డి, తోళ్లమడుగు ఖాదర్, క్రిస్టియన్‌సెల్ నాయకులు రమేష్‌రెడ్డి, ప్రదీప్‌కుమార్, రాష్ట్ర బీజేపీవైఎం ఉపాధ్యక్షుడు డాక్టర్ రాజేష్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, జంబాపురం రమణారెడ్డి, పొట్టిపాడు గోపీనాథరెడ్డి, కొమెర్ల రామలింగారెడ్డి, మండలాధ్యక్షుడు సంగంరెడ్డి నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వివేకా హంతకులకు ఓటెయ్యొద్దు

- ప్రత్యేక హోదాను జగన్ బీజేపీకి తాకట్టుపెట్టాడు
- హత్యచేసినవారికి ఎంపీ టిక్కెటు ఇస్తారా
- హంతకులను చట్టసభలకు వెళ్ళకుండా అడ్డుకోవాలి
- ఓటుతోనే హంతకులకు బుద్ధిచెప్పాలి : వైఎస్ షర్మిల, వైఎస్ సునీత

కాశినాయన ఏప్రిల్ 5: సౌమ్యుడు వివాదరహితుడైన వైఎస్ వివేకా నందరెడ్డిని అత్యంత ఘోరంగా గొడ్డలితో చంపిన వ్యక్తులకు ఓటు వేయవద్దని దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కూతురు ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి, వైఎస్.వివేకానందరెడ్డి కూతురు సునీత పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని అమగంపల్లె నుంచి ఇటుకులపాడు, సావిశెట్టిపల్లె, వరికుంట్ల, నర్సా పురం, కలసపాడు, మహా నందిపల్లె, లింగారెడ్డిపల్లె, శంకవరం మీదుగా ఎన్నికల రోడ్డుషో నిర్వహించారు. వైఎస్ సునీతతో కలిసి మొదటిసారి మండలానికి వచ్చిన షర్మిలకు బద్వేల్ కాంగ్రెస్ అభ్యర్థి ఎన్డీ విజయజ్యోతి, కడప కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీరాములు, రాజ్యసభ మాజీ సభ్యుడు ఎన్.తులసిరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలు అమగంపల్లె వద్ద ఘనస్వాగతం పలికారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్షంలోఉన్నప్పుడు ప్రత్యేక హోదాతెస్తానని నమ్మ బలికాడు. తీరాఅధికారంలోకి వచ్చాక ప్రత్యేక హోదాను బీజేపీకి తాకట్టుపెట్టాడని ఆరోపించారు. వివేకానందరెడ్డిని వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్ భాస్కర్‌రెడ్డి చంపించారని దోషులు వారేనని సీబీఐ అన్ని ఆధారాలతో నిరూపిస్తే వారు జైలుకు వెళ్ళకుండా జగన్ అడ్డుపడు తున్నారన్నారు. మరోవైపు వివేకానందరెడ్డిని చంపించిన వైఎస్ అవినాష్ రెడ్డికే మళ్లీ కడప ఎంపీ టిక్కెట్టు జగన్ ఇచ్చాడంటే ఇది అహంకారం కాకపోతే ఇంకేమనుకోవాలన్నారు. ఇలాంటి అన్యాయాన్ని అడ్డుకోవాలని హంతకులు గెలవకూడదని చట్టసభలకు వెళ్ళకుండా అడ్డుకోవాలనే రాశేఖర్‌రెడ్డి బిడ్డగా కాంగ్రెస్ పార్టీతరుపున కడప ఎంపీ అభ్యర్థిగా తాను నిలిచానని షర్మిలా పేర్కొన్నారు. అసెంబ్లీ అభ్యర్థి ఎన్డీ విజయ జ్యోతికి, కడప ఎంపీ అభ్యర్థినైన తనకు హస్తం గుర్తుపై ఓటేసి గెలిపించాలని షర్మిలా కోరారు. కార్యక్రమంలో భాగంగా శ్రీకాకుళం జిల్లాకు చెందిన వైసీపీ నాయకురాలు కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి దంపతులకు కాంగ్రెస్ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



కాశినాయన... మాట్లాడుతున్న షర్మిలారెడ్డి

కలసపాడు..: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే హత్యా రాజకీయాలకు స్వస్తి పలకాలని పీసీసీ అధ్యక్షురాలు, కడప కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వైఎస్ షర్మిలారెడ్డి తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రమైన కలసపాడులో ఆమె బస్సుయాత్ర నిర్వహించారు. కాగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అంటే వైఎస్ షర్మిలా అని వైఎస్ వివేకా కుమార్తె డాక్టర్ సునీతారెడ్డి తెలిపారు. నాన్న వివేకాను చంపిన వారికి, షర్మిలాకు మధ్య పోటీ అన్నారు. నాన్న చివరి కోరిక షర్మిలాను ఎంపీగా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ మాజీ సభ్యుడు తులసిరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి విజయజ్యోతి, జిల్లా కాంగ్రెస్‌పార్టీ నాయకుడు శ్రీరాములు, పెద్దసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

హంతకులను కాపాడుతున్న వైఎస్ జగన్

పోరుమామిళ్ల, ఏప్రిల్ 5 : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి హంతకులను కాపాడుతున్నాడని హంతకులు ఎంపీగా గెలిచి చట్టసభలకు వెళ్లకూడదని కడప ఎంపీ అభ్యర్థి వైఎస్ షర్మిలారెడ్డి అన్నారు. శుక్రవారం పోరుమామిళ్లలోని మహాత్మాగాంధి విగ్రహం సర్కిల్, అంబేడ్కర్ సర్కిల్ వద్ద బస్సు యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హంతకులు రాజకీయాల్లో కొనసాగడానికి వీలు లేదని ఎన్నికల్లో ఓడించాలన్నారు. వివేకా కుమార్తె డాక్టర్ సునీతారెడ్డి మాట్లాడుతూ తన తండ్రికి జరిగిన అన్యాయం మరెవరికీ జరగకూడదనే ఉద్దేశ్యంతో తాను ఈ పోరాటం చేస్తున్నానన్నారు. బద్వేలు కాంగ్రెస్ అభ్యర్థి విజయజ్యోతి మాట్లాడుతూ తాను ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్నానని ఈ సారి తనను ఆశీర్వదిస్తే నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు తులసిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు గుండ్లకుంటశ్రీరాములు, అన్వర్ పాల్గొన్నారు

బి.కోడూరు..: చిన్నాన్న వైఎస్ వివేకానుచంపిన వ్యక్తికి జగన న్న ఎంపీ టికెట్ ఇచ్చి పక్కన బెట్టుకున్నాడని అలాంటి వారిని ఓడించేందుకు రాజన్న బిడ్డ అయిన తనకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలపించాలని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం బస్సు యాత్రలో భాగంగా బి.కోడూరు మండలం పాయలకుంట్లలో కొద్దిసేపు ఆమె ఆగి, ప్రజలనుద్దేశించి ఆమె మాట్లాడారు. ఆమె వెంట వైఎస్ వివేకా కుమార్తె డాక్టర్ సునీతా, బద్వేలు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి విజయజ్యోతి, శ్రీరాములు పాల్గొన్నారు.

బద్వేలు..: ఈ ఎన్నికలలో తనను గెలిపించి జగన్‌రెడ్డి అహంకారానికి బుద్ధి చెప్పాలని కడప పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి, పీసీసీ అధ్యక్షురాలు వైఎస్.షర్మిల పేర్కొన్నారు. కడప పార్లమెంటు కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా ఎన్నికల ప్రచారాన్ని కాశినాయన మండలం అమగంపల్లె నుంచి శుక్రవారం ఆమె బస్సుయాత్ర ప్రారంభించారు. అనంతరం బద్వేలు నియోజకవర్గంలో బస్సు యాత్ర సాగింది. శుక్రవారం సాయంత్రం బద్వేలు నాలుగురోడ్ల కూడలిలో షర్మిలా మాట్లాడుతూ తన చిన్నాన్న వివేకానందరెడ్డిని హత్య చేసినట్లు అభియోగాలు ఎదుర్కొంటున్న వైఎస్.అవినాష్‌రెడ్డికి తిరిగి ఎంపీ సీటు కేటాయించడతోపాటు తనతో తిప్పుకుంటున్న జగన్‌రెడ్డిది అహంకారం కాదా అని ఆమె ప్రశ్నించారు. కడప పార్లమెంటు సభ్యురాలిగా తనను, బద్వేలు నియోజకవర్గ ఎమ్మెల్యేగా విజయజ్యోతిని గెలిపించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తులసిరెడ్డి, బద్వేలు అసెంబ్లీ అభ్యర్థి విజయజ్యోతి, వివేకా కుమార్తె సునీతరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శ్రీరాములు,కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా జగ్జీవన్‌రామ్ జయంతి



కొండాపురంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 5: జగ్జీవన్‌రామ్ జయంతిని దళిత, విద్యార్థి యువజన, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం దళిత ప్రజాసంఘాల కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల విద్యార్థి యువజన సమాఖ్య రాష్ట్ర కన్వీనర్ ఓబులేసు, గడ్డం నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

బద్వేలు..: జగ్జీవన్ రామ్ జయంతిని జగ్జీవన్‌రామ్ ఆశయన సాధన సమితి, డాక్టర్ బీ.ఆర్. అంబేడ్కర్‌సమితి, ఆవాజ్, ఆర్యవైశ్యవర్తక సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణంలోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కొండపల్లి చిన్న సుబ్బారావు, వర్తక సంఘం అధ్యక్షుడు కేవి.సుబ్బారావు, పూలే ఆశయ సాధన సమితి ఛైర్మన్ గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు. వీరారెడ్డి కళాశాల ఎన్ఎస్ఎస్ 1,2,3 యూనిట్ల ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

కొండాపురం..: స్థానిక జడ్పీ హైస్కూల్ ఆవరణలో డాక్టర్ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు బి.రమేష్ , నాయకులు శ్రీనివాసులు,నాగసుబ్బరాయుడు,కరుణాకర్, కుళ్లాయిప్ప, గంగాధర్,సుబ్బరాయుడు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కోడిగుడ్లపాడులో గుడి ప్రారంభోత్సవం

కాశినాయన ఏప్రిల్5: కోడిగుడ్లపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన మిట్టపాలెం నారాయణస్వామి గుడి ప్రారంభోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బద్వేల్ మాజీ ఎమ్మెల్యే కేవిజయమ్మ, బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జా రోశన్న ప్రత్యేక పూజలు చేశారు. వీరిని స్థానిక టీడీపీ నాయకులు శ్రీనివాసులరెడ్డి,నర్సిరెడ్డి పూలమాల శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో భాగంగా బండలాగుడు పోటీలు నిర్వహించి విజేతలకు నగదు బహుమతులు అందజేశారు.భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు.

దివ్యాంగులకు నూతన దుస్తులు పంపిణీ

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 5: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ మదర్‌థెరిస్సా దివ్యాంగుల సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం దివ్యాంగులకు నూతన దుస్తులు పంపిణీ చేశారు. హైటెక్ గైబూసా జ్ఞాపకార్థం ఆయన కుమారుడు హైటెక్ ఫయాజ్ 50 మంది దివ్యాంగులకు నూతన దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మదర్‌థెరిస్సా దివ్యాంగుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు షాకీర్ హుస్సేన్, మహమ్మద్ బాష, చెన్నకేశవరెడ్డి, వెంకటసుబ్బయ్య, హనుమంతు, అల్తాఫ్, భద్రుడు తదితరులు పాల్గొన్నారు.

9నుంచి పెద్దపీరయ్యస్వామి ఆరాధన మహోత్సవాలు

బ్రహ్మంగారిమఠం, ఏప్రిల్ 5 : సిద్ధయ్యస్వామి కుమారుడు పెద్దపీర య్యస్వామి ఆరాధన మహోత్సవాలు ఏప్రిల్ 9 నుంచి రెండురోజుల పాటు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ప్రస్తుత మఠాధిపతి రామక్రిష్ణస్వామి పేర్కొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ పెద్దపీరయ్యస్వామి ఆరాధన మహోత్సవాలను ఉగాది పండుగ రోజున నిర్వహిస్తామన్నారు. ఉదయం పూలపూజ ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే వస్త్రాలంకరణ పెద్దపీరయ్యస్వామి, సిద్ధయ్యస్వామికి నిర్వహిస్తారన్నారు. రాత్రికి గ్రామోత్సవం అత్యంత వైబవంగా నిర్వహిస్తామన్నారు. అలాగే మైదుకూరు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ ఆధ్వర్యంలో యాదవ అన్నసత్రంలో అన్నదానం ఉంటుందన్నారు. అనంతరం రాత్రికి భక్తులకు కాల క్షేపం కోసం భజన కార్యక్రమాలు ఉంటాయన్నారు. 10వతేదీ ఉదయం 8గంటల నుంచి చిన్నబండ లాగుడు పోటీలుంటాయన్నారు. అలాగే 16, 13 మనుముల గుండు ఎత్తే పోటీలు ఉంటాయన్నారు.

వికలాంగుల భూ పోరాటానికి సిద్ధం కావాలి

బద్వేలు, ఏప్రిల్ 5: పట్టణంలోని ప్రతి వికలాంగునికి ఇంటి స్థలం అందించాలనే సంకల్పంతో నిర్వహించే భూ పోరాటానికి సిద్ధం కావాలని సీపీఐ జిల్లా సమితిసభ్యుడు వెంకటరమణ, కార్యదర్శి బాలు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయం జేవి.భవన్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ పట్టణంలో దాదాపు 1500 మంది వికలాంగులు ఇల్లులేని వారు ఉన్నారని వారు వేసుకున్న గుడిసెలను అధికారులు తొలగించారని వారికోసం మరో భూ పోరాటం తప్పదని ఇందుకోసం వికలాంగులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏరియా కార్యవర్గ సభ్యులు విజయమ్మ, యువజన నాయకులు అనిల్, రమణ, భరత్, సీపీఐ పట్టణ నాయకులు నాగసుబ్బయ్య, సుబ్బారెడ్డి, నారాయణ, ఏసన్న, లక్ష్మణ్, డీహెచ్‌పీఎస్ అధ్యక్షులు రమణ, తదితరులు పాల్గొన్నారు.